teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 03 | సంచిక : 95 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 28 జూలై 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఈ నెల 29కి తెలంగాణ శాసనసభ వాయిదా

### ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. బడ్జెట్‌పై సాధారణ చర్చ ముగియగానే సభను ఈ నెల 29వ తేదీకి సభ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. 29వ తేదీన ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శాసనసభ



## నీతి ఆయోగ్ సమావేశం నుంచి దీదీ వాకౌట్

**మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం**

**మరో వైపు హాజరు కానీ కూటమికి సంబంధిత సీఎంలు**

**చర్చనీయాశంగా మారిన నీతి ఆయోగ్ 9వ సమావేశం**

న్యూ ఢిల్లీ, జులై 27 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లోని కల్చరర్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీతోపాటు ఎన్డీఏ కూటమిలోని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అయితే



మిగతా 2 లో

## అసెంబ్లీలో వాడివేడిగా సమావేశాలు

**అధికార పార్టీ, ప్రతికపక్షాల నడుమ మాటల యుద్ధం**

**గత పథకాలపై విచారణకు సిద్ధమా..**

**బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి. అధికార పార్టీ, ప్రతికపక్షాల నడుమ మాటల యుద్ధం నడుస్తోంది. కాగా ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బతుకమ్మ చీరలు, గొర్రెల



మిగతా 2 లో

## శ్రీలంకను 43 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీంఇండియా

**ఐదుగురు బౌలర్లతోనే ఆట మొత్తాన్ని మలుపు తిప్పిన టీంఇండియా**

**టీ20 వరల్డ్ ఛాంపియన్స్ లో టీమిండియా విజయ పరంపర**

తీన్మార్ వెబ్ డెస్క్, జులై 27 (తీన్మార్ న్యూస్): టీ20 వరల్డ్ ఛాంపియన్స్ టీమిండియా విజయ పరంపర కొనసాగుతోంది. శ్రీలంక పర్యటనలోనూ టీమ్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి టీ20లో శ్రీలంకను 43 పరుగుల తేడాతో చిత్తు



మిగతా 2 లో



## భూ సమస్యలపై త్వరలో అఖిలపక్ష భేటీ

**ప్రజల నుండి సూచనలు స్వీకరించాకే సమగ్ర భూచట్టం**

**అవసరమైతే అసెంబ్లీలోనూ చర్చిస్తం: సీఎం రేవంత్**

**భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని వెల్లడి**

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): భూ సమస్యలపై త్వరలో అఖిలపక్ష భేటీ ఏర్పాటుచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అసెంబ్లీలో చర్చించి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాకే సమగ్ర భూచట్టం తీసుకొస్తామని చెప్పారు. సెక్రటేరియెట్‌లో ధరణి సమస్యలపై ఆయన రివ్యూ నిర్వహించి మాట్లాడారు. ధరణి కారణంగా తలెత్తుతున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. భూ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయని తెలిపారు. సమగ్ర భూచట్టం రూపొందించాల్సిన

మిగతా 2 లో





# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మొదలైన కసరత్తు

### ఓటరు జాబితాను సిద్ధంచేయుటకు ఎన్నికల సంఘం నిర్ణయం

**ఓటరు జాబితా తయారీకి డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ**

**కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియకు పూనుకొనున్న సర్కార్**

**కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ జారీ**



హైదరాబాద్, జూలై 27 (తీన్మార్ న్యూస్): పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ప్రాథమిక కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ప్రారంభించింది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేయడంపై ఆగస్టు 2, 3 తేదీల్లో జిల్లాల వారీగా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకుగాను ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్ల పేర్లతో జాబితాను ఈనెల 31వ తేదీ లోపు మెయిల్ ద్వారా పంపాలని కలెక్టర్లకు సూచిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. కాగా కొత్త ఓటరు జాబితాను

మిగతా 2 లో

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**సిబ్బంది కొరత ఉంటే డెప్యూటేషన్లో తీసుకోవాలి**

**ఆదేశాలున్న ల్యాండ్స్ మినహా మిగ క్రమబద్ధీకరనకు ఆదేశాలు**



ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను వీలైనంత వేగంగా పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందు కోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక్కో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్ పై తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పటిష్టంగా ఎల్ ఆర్ఎస్‌ను అమలు చేయాలని ఆయన సూచించారు.

తెలంగాణ బ్యూరో, జులై 27 (తీన్మార్ న్యూస్): దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లే-అవుట్ లను క్రమబద్ధీకరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రంలో అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది అప్లికేషన్లు సమర్పించారు. కార్పొరేషన్లలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల్లో

మిగతా 2 లో



## మహంకాళి బోనాల మహోత్సవానికి సర్వం సిద్ధం

**సింహవాహిని ఆలయంతో పాటు ముస్తాబైన మరో 330 ఆలయాలు**

**ఆలయాల్లో పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు**

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): భాగ్యనరంలోని పాతబస్తీ సింహవాహిని మహంకాళి బోనాల మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. జాతర సందర్భంగా లాల్ దర్వాజ ముస్తాబు అయ్యింది. పాత బస్తీలోని సింహవాహిని ఆలయంతో పాటు మరో 330 ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. ఈరోజు తెల్లవారుజామున 3 గంటలకు లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారికి జల్లెకడువ నిర్వహించనున్నారు. తెల్లవారు

మిగతా 2 లో

## ఆగస్టు 9న ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలి

### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క



.. వివరాలు 2లో

## రాష్ట్రంలో రెండు రోజులపాటు మోస్తారు వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ శాఖ మరోసారి అలర్ట్**

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్: తెలంగాణలో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. రోజంతా జల్లులు కురుస్తున్న క్రమంలో హైదారాబాద్ వాతావరణ శాఖ మరోసారి అలర్ట్ చేసింది. ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని

మిగతా 2 లో



## త్వరలో మల్టీపర్పస్ హెల్త్ కార్డులు

**యూనిక్ నంబర్‌తో కార్డుల జారికి కసరత్తు**

**ఆరోగ్యశ్రీ, హెల్త్ అకౌంట్‌కు లింకు.**

**ఇదే నంబర్‌తో దవాఖానల్లో ఓపీ రిజిస్ట్రేషన్**

**బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన**



తెలంగాణ బ్యూరో, జులై 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు త్వరలోనే మల్టీపర్పస్ హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఆరోగ్యశ్రీ స్కీమ్, దవాఖానల్లో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగపడేలా యూనిక్ నంబర్‌తో ఈ కార్డులు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీని వర్తింపజేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం

మిగతా 2 లో

## కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు

**వేల కోట్ల రూ. అప్పుల కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి బండి**



హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అధిక వడ్డీలకు వేలాది కోట్ల రూపాయల అప్పులు తెచ్చే కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం

మిగతా 2 లో

# నీతి ఆయోగ్ సమావేశం నుంచి దీదీ వాకౌట్

మొదటి పేజీ తరువాయి

ఎన్డీఏ కీలక భాగస్వామిగా ఉన్న బీహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఆ సమావేశానికి రాకుండా డిప్యూటీ సీఎంలను పంపించడం తీవ్ర చర్చనీయాశంగా మారింది. మరోవైపు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రాలకు వివక్ష చూపిస్తోందని ఆరోపిస్తూ ఇండియా కూటమిలోని పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి రాలేదు. ఇక ఇండియా కూటమిలో భాగస్వామికి ఉన్న టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాత్రమే నీతి ఆయోగ్ సమావేశం నుంచి హాజరైనా మధ్యలో నుంచే ఆమె వాకౌట్ చేయడం ప్రస్తుతం తీవ్ర దుమారం రేగింది. తాను మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారని సమావేశం నుంచి బయటికి వచ్చిన తర్వాత మీడియా ముందు దీదీ ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాష్ట్రానికి నిధుల కేటాయింపు గురించి తాను మాట్లాడటం ప్రారంభించగానే.. తన మైక్ ఆఫ్ చేశారని ఆమె ఆరోపించారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌పై వివక్ష చూపారని.. రాష్ట్రానికి నిధులు కేటాయించాలంటూ తాను మాట్లాడగానే తన మైక్ ఆపేసి.. మాట్లాడకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. తనను మాట్లాడకుండా ఎందుకు వివక్ష చూపుతున్నారని తాను ప్రశ్నించానని.. ప్రతిపక్షాల తరఫున హాజరైంది తాను ఒక్కదాన్నేనని మమతా బెనర్జీ చెప్పారు. విపక్షాల నుంచి వచ్చిన తను ఒక్కదాన్ని కూడా వారు ఆపారని ఆరోపించారు. సమావేశంలో పాల్గొన్న మిగతా సభ్యుల మాదిరిగానే మాట్లాడేందుకు తనకు తగిన సమయం ఇవ్వకపోవడం అవమానించడమేనని దీదీ అసహనం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడేందుకు 20 నిమిషాల సమయం ఇచ్చారని.. ఇతర బీజేపీ సీఎంలకు కూడా 15 నిమిషాలు కేటాయించారని తెలిపిన దీదీ.. తనకు మాత్రం 5 నిమిషాల కంటే తక్కువ సమయం ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా చేయడం అన్ని ప్రాంతీయ పార్టీలను అవమానించడమేనని ఆమె విమర్శించారు. భవిష్యత్తులో ఇంకెప్పుడూ తాను నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకానని తేల్చి చెప్పేశారు. ఇక మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నేతలు బాయ్‌కాట్ చేసేందుకు నీతి ఆయోగ్ సమావేశాన్ని ఒక వేదికగా చేసుకున్నారని విమర్శలు చేశారు.

# అసెంబ్లీలో వాడివేడిగా సమావేశాలు

మొదటి పేజీ తరువాయి

స్కీమ్, కేసీఆర్ కిట్లు పథకాల అవకతవకలపై విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అవినీతి జరిగిందని సీఎం రేవంత్ ఆరోపించారు. గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి చేశారని అన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లలోనూ భారీగా అవినీతి జరిగిందని చెప్పారు. సూరత్ నుంచి నాసిరకం చీరలు తీసుకొచ్చి తెలంగాణ మహిళలకు ఇచ్చారని అన్నారు. రూ.వేలకోట్ల భూములను అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. సభలో అన్ని లెక్కలు బయటకు తీస్తామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# శ్రీలంకను 43 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీంఇండియా




మొదటి పేజీ తరువాయి

చేసింది. ఐదుగురు బౌలర్లతోనే బరిలోకి దిగినా లంక టాపార్డర్ భయపెట్టినా చివరి ఐదు ఓవర్లలో మ్యాచ్ మొత్తాన్ని మలుపు తిప్పారు మన బౌలర్లు. 30 బంతుల్లో 29 పరుగులు చేసి ఏకంగా 9 వికెట్లు కోల్పోయింది శ్రీలంక టీమ్. శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో వరల్డ్ ఛాంపియన్స్ విజయం సాధించారు. బ్యాటింగ్ లో సూర్య, పంత్, యశస్వి, గిల్ బౌలింగ్ లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, సిరాజ్ రాణించడంతో మూడు టీ20ల సిరీస్ లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 214 పరుగుల చేజింగ్ లో ఒక దశలో శ్రీలంక 14 ఓవర్లలో వికెట్ నష్టానికి 140 పరుగులతో టార్గెట్ వైపు వెళ్తున్నట్లు కనిపించింది. అయితే 15వ ఓవర్ తొలి బంతికి టాప్ ఫామ్ లో ఉన్న పథుమ్ నిస్సంకను అక్షర్ పటేల్ ఔట్ చేయడంతో లంక పతనం మొదలైంది. నిస్సంక కేవలం 48 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్స్ లతో 79 రన్స్ చేశాడు. అతడు ఉన్నంత సేపు లంకను గెలిపించేలానే కనిపించాడు. అతనికి తోడు మరో ఓపెనర్ కుశల్ మెండిల్ కూడా 27 బంతుల్లోనే 45 రన్స్ చేశాడు. అయితే నిస్సంక ఔటవగానే లంక పూర్తిగా గాడి తప్పింది. వాళ్ల ఇన్నింగ్స్ చివరి 30 బంతుల్లో కేవలం 29 పరుగులు చేసి ఏకంగా 9 వికెట్లు కోల్పోవడం గమనార్హం. రియాన్ పరాగ్ 3 వికెట్లు, అక్షర్ పటేల్ 2, అర్ష్‌దీప్ 2, బిష్ణోయ్, సిరాజ్ చెరొక వికెట్ తీసుకున్నారు. 170 పరుగులకే శ్రీలంక కుప్పకూలింది.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి

10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ ప్లాట్లు, నాన్ లే అవుట్ కు సంబంధించిన వాటికి దరఖాస్తుదారులు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించి, తమ డాక్యుమెంట్ కాపీని సమర్పించారు. పెద్ద లే అవుట్ స్థలాలకు సంబంధించి రూ.10 వేలు దరఖాస్తు ఫీజుగా చెల్లించారు. అందులో ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న ల్యాండ్స్‌మినహా మిగతా వాటిని పరిష్కరించాలి అని భట్టి అధికారులకు సూచించారు. కాగా, దాదాపు నాలుగేండ్లుగా ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు క్లియర్ కావడం లేదు. వాటిని పరిష్కరిస్తే ప్రభుత్వానికి రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

# త్వరలో మల్టీపర్పస్ హెల్త్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

తీసుకున్నది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజలందరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకు తగ్గట్టుగానే హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ కోసం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఆరోగ్య శ్రీ కూడా ఉంది. ఆ స్కీమ్‌కు పునరుజ్జీవం పోసేందుకు ఇటీవలే ప్యాకేజీల ధరలను 20 శాతం మేర పెంచారు. రేషన్ కార్డులు లేకపోవడం వల్ల చాలా మంది స్కీమ్‌కు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరోగ్యశ్రీకి రేషన్‌కార్డుకు లింకును తొలగించాలని నిర్ణయించారు. కొత్తగా 163 రకాల ప్రొసీజర్లను స్కీమ్‌లో చేర్చారు.

దవాఖాన్లకూ లింకు

స్టేట్ హెల్త్ ప్రొఫైల్ పేరిట హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ కోసం గత సర్కార్ ప్రయత్నించింది. ములుగు, సిరిసిల్ల జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ప్రజలందరికీ రకరకాల టెస్టులు చేయించింది. తర్వాత కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపేశారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ డిజిటలైజేషన్‌పై దృష్టి పెట్టింది. గత సర్కార్‌లో చేసినట్టుగా ఇంటింటికీ వెళ్లి ఒకేసారి లక్షల మందికి టెస్టులు చేయించడానికి బదులు, క్రమక్రమంగా డిజిటలైజేషన్ చేపట్టాలని భావిస్తున్నది. తొలుత జనాలకు యూనిక్ నంబర్లతో డిజిటల్ కార్డులను ఇచ్చి, తర్వాత జనాలకు ఏదైనా అనారోగ్య సమస్య వచ్చి హాస్పిటల్‌కు వచ్చినప్పుడు అదే నంబర్‌లో వారి ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్ చేయాలని ప్లాన్ చేస్తున్నది. అదే నంబర్‌తో వారి పేరిట డిజిటల్ హెల్త్ అకౌంట్ క్రియేట్ చేసి, వారు చేయించుకున్న టెస్టుల రిపోర్టులను, వారికి డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్ కాపీలను ఆ డిజిటల్ హెల్త్ అకౌంట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ హెల్త్ అకౌంట్లను ఓపెనింగ్‌కు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉండేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ దవాఖానకు పోయినా, ప్రైవేటు దవాఖానకు పోయినా రోగుల అనుమతితోనే హెల్త్ అకౌంట్ ఓపెన్ చేయనున్నారు. ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌కు కూడా డిజిటల్ హెల్త్ అకౌంట్ ఉపయోగపడుతుందని, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రస్తుతం ఈ తరహా విధానం అమల్లో ఉందని డాక్టర్లు చెబుతున్నారు. పేషెంట్ హెల్త్ హిస్టరీని చెక్ చేయడం ఈజీ అవుతుందని, తద్వారా తక్కువ టైమ్‌లోనే డయాగ్నోసిస్ చేసి, ట్రీట్‌మెంట్ ప్రారంభించొచ్చునని అంటున్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మొదలైన కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితా పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా రిపోర్ట్ ఇవ్వాలని బీసీ కమిషన్‌ను ఆదేశించారు. బీసీ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వీలైనంత త్వరగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 31వ తేదీతోనే గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. ఆగస్టు 1వ తేదీ నాటికి ఆరు నెలలు పూర్తవుతుంది. గ్రామ సర్పంచ్ పదవీకాలం పూర్తయినందున ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. ఆరు నెలలు దాటితే కేంద్రం నుంచి గ్రామాలకు వచ్చే గ్రాంట్స్ ఆగిపోతాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా




ఇందుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఇన్నాళ్లు రిజర్వేషన్లపై స్పష్టత కోసం స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యం అవుతున్నాయని అందరూ అనుకున్నారు. కుల గణన నిర్వహించి రిజర్వేషన్లను ఖరారు చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల డిమాండ్లు వస్తున్నాయి. గత రిజర్వేషన్ల పద్ధతిలో బీసీలు ఎక్కువగా నష్టపోతున్నారనే భావన ఉన్నది. ఒక వేళ గత పంచాయతీ ఎన్నికల్లో పాటించిన రిజర్వేషన్ల విధానాన్నే పాటిస్తే కుల సంఘాలు భగ్గుమనే అవకాశం లేకపోలేదు. అయితే, వచ్చే నెల 1వ తేదీన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. ఒక వేళ అప్పుడు తీసుకున్నా నోటిఫికేషన్ రావడానికి, వచ్చాక పోలింగ్ జరగడానికి ఇంకా సమయం పడుతుంది. అలాగైతే ఆగస్టులో లేదా సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. కుల గణన చేపట్టి రిజర్వేషన్లను నిర్ణయించాలంటే అందుకు మరో ఐదారు నెలల సమయం పడుతుందని తెలుస్తున్నది.

# మహంకాళి బోనాల మహోత్సవానికి సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

జామున 4 గంటలకు బలిహారణ, ఉదయం 5.30 గంటలకు దేవి మహాభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. కాగా లాల్ దర్వాజ సింహవాహిని ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాలిబండ అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మరోవైపు కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, మీరాలం మండి మహంకాళి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సబ్జీ మండి నల్ల పోచమ్మ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇంకా చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్టీఆర్ నగర్ సరూర్ నగర్ ఖిలా మైసమ్మ ఆలయంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, నాచారం ఉప్పల్ మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇక లాల్‌దర్వాజ బోనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 100 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచినట్లు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా లాల్ దర్వాజ బోనాలు సందర్భంగా 2,500 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. పాత బస్తీలోని ఫలక్‌నుమా, చార్మినార్, బహదూర్‌పురా, మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈనెల 28, 29 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం బోనాల ఊరేగింపు, సోమవారం ఘటాల ఊరేగింపు పాతబస్తీలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆది, సోమవారాల్లో రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు. అక్కన్న మాదన్న దేవాలయం నుండి నయాపూల్ వరకు ఏనుగుపై ఈ భారీ ర్యాలీ తెల్లవారుజాము నుండి రాత్రి వరకు కొనసాగుతుంది. కాగా లాల్ దర్వాజ దేవాలయం, ఎంజీబీఎస్, రెతిఫైల్, జేబీఎస్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 9959226154, 9959 226160 నంబర్లలో సంప్రదించవచ్చని వెల్లడించారు.

వాహనాల మళ్లింపు

- హిమ్మత్‌పురా నుంచి షంషీర్‌గంజ్ వైపు వెళ్లే వాహనాలను గౌలిపురా, సుధా టాకీస్ మీదుగా మళ్లిస్తారు.
- చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను గౌలిపుర, నాగుల్చింత మీదుగా మళ్లిస్తారు.
- మహబూబ్ నగర్ ఎక్స్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను జహనుమా, గోశాల, తాడ్‌బాన్, ఖిలావత్ మీదుగా మళ్లిస్తారు.
- ఇంజిన్ బౌలి నుండి షంషీర్‌గంజ్ వైపు వచ్చే వాహనాలను మళ్లించడం.
- చార్మినార్ నుంచి వచ్చే వాహనాలను హరిబౌలి వద్ద మళ్లిస్తారు.
- చాదర్‌ఘాట్ నుంచి వచ్చే వాహనాలను పురానా హవేలీ రోడ్డు, శివాజీ బ్రిడ్జి వద్ద మళ్లిస్తారు.
- మొగల్‌పురా, మీర్‌చౌక్ నుంచి వచ్చే వాహనాలను మీర్ కా డియారా వైపు మళ్లించనున్నారు.

# ఆగస్టు 9న ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలి

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఈ దినోత్సవం నిర్వహించాలని 1994లో ఐక్య రాజ్య సమితి ప్రకటించింది. ప్రొటెక్టింగ్ ది రైట్స్ అఫ్ ఇండైజెనౌస్ పీపుల్స్ ఇన్ వాలంటరీ ఐసొలేషన్ అండ్ ఇనిషల్ కాంటాక్ట్ థీమ్ తో 2024 లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోనున్నారు. ప్రపంచ ఆదివాసీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం డిసెంబర్ 1994 నుంచి జరుపుకుంటున్నారు. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఈ వార్షిక స్మారకాన్ని ఆగస్టు 9న నిర్వహించింది. 1982లో జెనీవాలో జరిగిన మానవ హక్కుల ప్రమోషన్ అండ్ ప్రొటెక్షన్‌పై సబ్-కమిషన్ స్థానిక జనాభాపై యూఎన్ వర్కింగ్ గ్రూప్ ప్రారంభ సమావేశాన్ని సూచిస్తున్నందున ఈ తేదీ ఎంపిక ప్రతీకాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉంది.

# ఈ నెల 29కి తెలంగాణ శాసనసభ వాయిదా

మొదటి పేజీ తరువాయి

రాత్రి 9:15 గంటల వరకు కొనసాగింది. బడ్జెట్ ప్రసంగం ఒక రాజకీయ ప్రసంగంలా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన బాగాలేదని మాటలు చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో ఉన్న సమాచారాన్ని తొలగించారు. కంప్యూటర్ నుంచి తొలగిస్తారేమో కానీ, ప్రజల మెదడు నుంచి తొలగించలేరని పేర్కొన్నారు. అక్షరాలను తొలగిస్తారేమో కానీ, అనుభవాల్ని తొలగించలేరన్నారు. బీఆర్ఎస్ శ్రమను, కాంగ్రెస్ ఎనిమిది నెలల డ్రామాలను ప్రజలు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం అవాస్తవాలతో నిండి ఉంది. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్‌లో పెట్టారు. పన్నేతర ఆదాయంలో రూ.35 వేల కోట్లు వస్తుందని బడ్జెట్‌లో చూపించారు. ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. విధానాల రూపకల్పన కంటే బీఆర్ఎస్‌ను తిట్టడంపైనే ఎక్కువ దృష్టిపెట్టారన్నారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇప్పుడు రూ.10 వేల కోట్ల విలువ చేసే భూములు అమ్మి నిధులు సమీకరిస్తున్నారుని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధ్యంకాని తరహాలో ఆదాయం ఎక్కువ చూపించారని, తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపించారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే వస్తున్నది. ఆలస్యం అయిందని రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి వడ్డీ భారాన్ని రైతులపై మోపుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 వందల పింఛన్ ఇస్తే బీఆర్ఎస్ పాలనలో రూ.2వేలకు పెంచామని తెలిపారు. అధికారంలోకి రాకముందు రూ.4 వేలు పింఛన్ ఇస్తామన్నారు. ఆ 4 వేల పింఛన్ ఇంకా నాలుక మీదనే ఉందని ఎద్దేవా చేశారు.

# భూ సమస్యలపై త్వరలో అఖిలపక్ష భేటీ

మొదటి పేజీ తరువాయి

అవసరం ఉందన్నారు. ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే రికార్డులు అందుబాటులో ఉండేవి. చట్టాల్లో వచ్చిన మార్పుల కారణగా క్రమంగా మండల కేంద్రానికి తర్వాత జిల్లా కేంద్రానికి ఆ తర్వాత రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయినయ్. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ చేసుకునే అవకాశం ఉండేది. ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండా పోయింది. అధికారాలన్నీ కలెక్టర్‌కు అప్పజెప్పారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారు. ఈ నేపథ్యంలో భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తాం. అప్పుడే పూర్తి స్పష్టత వస్తది"అని అన్నారు. భూములకు సంబంధించిన అన్ని సమస్యలపై అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

పెండింగ్ అప్లికేషన్లు వెంటనే పరిష్కరించండి

ధరణి పోర్టల్‌లో పెండింగ్ అప్లికేషన్లపైనా సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. మొత్తం 3,49,514 అప్లికేషన్లు ధరణిలో ఉండగా అందులో 1.80 లక్షల అప్లికేషన్లు పరిష్కరించినట్లు అధికారులు వివరించారు. మిగతా వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో ఉన్న మాడ్యూల్స్ విషయంలోనూ ఇంకా యూజర్ ఫ్రెండ్లీ ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

# విడుదలైన "టీజీ" ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్

ప్రవేశాలకు ఈనెల 31 నుంచి ప్రారంభం కానున్న కౌన్సెలింగ్

ప్రకటన విడుదల చేసిన ఉన్నత విద్యామండలి




హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): టీజీ ఎడ్‌సెట్, టీజీ పీఈసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. టీజీ ఎడ్‌సెట్ ద్వారా బీఈడీ కాలేజీల్లో, పీఈసెట్ ద్వారా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఎడ్‌సెట్, పీఈసెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 31 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

అర్హులైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం ఆగస్టు 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ తేదీల్లోనే అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. 12 నుంచి 16వ తేదీ మధ్యలో ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. 21న అర్హత గల అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. 22 నుంచి 23వ తేదీ వరకు అర్హులు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చు. 24న వెబ్ ఆప్షన్స్‌ను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 30వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 31 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 31 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

అర్హులైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం ఆగస్టు 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ తేదీల్లోనే అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. 13 నుంచి 14వ తేదీ మధ్యలో ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్, స్పోర్ట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. 14న అర్హత గల అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. 16 నుంచి 17వ తేదీ వరకు అర్హులు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చు. 18న వెబ్ ఆప్షన్స్‌ను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 20వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 21 నుంచి 24వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 27 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

# రాష్ట్రంలో రెండు రోజులపాటు మోస్తారు వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. సముద్ర మట్టానికి 7.6 కి. మీ ఎత్తు వరకు ఆవర్తనం విస్తరించి ఉందని, ఈ ప్రభావంతో వచ్చే రెండు రోజుల్లో తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న- సిరిసిల్ల, వరంగల్, హన్మకొండ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక హైదరాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గత 24 గంటల్లో ములుగు జిల్లా తద్వాయిలో 5.54 సెం.మీ, ఏటూరునాగారంలో 5.49 సెం.మీ, మంగపేటలో 5.28 సెం.మీ, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో 5.05 సెం.మీ, అశ్వాపురంలో 4.35 సెం.మీ, బూర్గంపాడులో 4.14 సెం.మీ, పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్‌లో 4.56సెం.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లిలో 4.08 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# సభలో ప్రతిపక్ష నేతల ప్రసంగం టీవి స్క్రీన్లలో చూపించట్లేదు

చర్చలో భాగంగా స్పీకర్ ను కోరిన ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్, జులై 27 (తీన్మార్ న్యూస్): దయచేసి మమ్మల్ని కూడా చూపించండి అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కోరారు. తెలంగాణలో శాసనసభ సమావేశాలు జోరుగా కొనసాగుతున్నాయి. 2024-25 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా అధికార ప్రతిపక్షాలు ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నాయి. శనివారం బడ్జెట్ పై చర్చలో భాగంగా బీఆర్ఎస్ నేత హరీష్ రావు మాట్లాడే ముందు ప్రభుత్వానికి, స్పీకర్ కు కీలక రిక్వెస్ట్ చేశారు. సభలో ప్రతిపక్ష నేతల ప్రసంగం సమయంలో టీవి స్క్రీన్ లలో తమని చూపించట్లేదని వాపోయారు. నిన్న మొన్న సభా సమయంలో అలాగే జరిగిందని అన్నారు. మొన్న పార్లమెంట్ లో రాహుల్ గాంధీ కూడా అదే చెప్పారని, ఆయన మాట్లాడుతుంటే స్క్రీన్ చూపించట్లేదని అన్నారని, రాహుల్ గాంధీ వారసులుగా చెప్పుకునే మీరు అలాంటి పని చేయవద్దని అన్నారు. దయచేసి సభలో ప్రతిపక్ష నేతలు మాట్లాడే సమయంలో స్క్రీన్ లు చూపించాలని హరీష్ రావు కోరారు.



# కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు

మొదటి పేజీ తరువాయి

పడుతుందన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అన్నీ గాడిద గుడ్డే అన్నారు. 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలూ గాడిద గుడ్డే అన్నారు. నీతి అయోగ్ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకాకపోవడం దుర్మార్గమన్నారు. భారత్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడం, కేంద్ర రాష్ట్ర సంబంధాల బలోపేతమే లక్ష్యంగా నీతి అయోగ్ సమావేశం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవకాశవాద పార్టీలు అని విమర్శించారు. అవకాశం వస్తే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం అవడం ఖాయమని జోస్యం చెప్పారు. కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# డిజిటల్ యూనివర్శిటీ ఆవశ్యకత

విద్యా బోధన ఎన్నో రకాలు, ఆ బోధనకు ఎన్నో మార్గాలు. విద్యార్థులు, గురువులు ప్రత్యక్షంగా ఒకరి సమక్షంలో ఒకరుండి చదువు నేర్పడం, నేర్చుకోవడం సాంప్రదాయిక విధానం. అయితే వివిధ కారణాల వల్ల అందరికీ అది సాధ్య పడక పోవచ్చు . పాఠశాలలు అంతటా అందుబాటులో ఉన్నా కాలేజీలు పట్టణాలకు, యూనివర్శిటీలు నగరాలకే పరిమితం. తగిన ఆర్థిక స్తోమత ఉంటే తప్ప పైచదువులు అందుకోలేరు. 2021-22 విద్యా సంవత్సరంలో మన దేశంలో పదవ తరగతి తర్వాత 35 లక్షల మంది పైచదువులకు వెళ్లలేకపోయారని స్కూల్ ఎడ్యుకేషన్ డేటాలో ఉంది. పదవ తరగతి చదివిన విద్యార్థుల్లో వీరు 20% ఉంటారు. రాష్ట్రాల వారీగా చూస్తే ఈ సంఖ్య ఒడిశా, బీహార్‌లలో 40% పైగా ఉంటే, కర్ణాటక, ఎపి, తెలంగాణలో 27% ఉంది. ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ కొరవడితే రాబోయే కాలంలో యువత దేశానికి భారంగా మారే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. అందుకే నూతన జాతీయ విధానం ద్వారా 2030 నాటికి ఈ సంఖ్యను వీలైనంత తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం విద్యా విధానంలో భారీ మార్పులు అవసరం. విద్యా వ్యాప్తికి ప్రత్యక్ష బోధన సాధ్యం కాని చోట 1980 లలో దూర విద్య ప్రవేశించి డ్రాప్‌అవుట్‌ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఓపెన్ స్కూళ్ళు, యూనివర్శిటీల కరస్పాండెన్స్ కోర్సుల ద్వారా ఎందరో ఉన్నత విద్యను అందుకుంటున్నారు. పనులు చేసుకుంటూ ఇంటి వద్ద నుండే వీటిలో ప్రవేశం పొంది వివిధ కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరినవారు, పదోన్నతి పొందినవారు ఎందరో ఉన్నారు. అయితే స్టడీ మెటీరియల్ పోస్టు ద్వారా తెప్పించుకోవటం, అప్పుడప్పుడు కాంటాక్ట్ క్లాసులు హాజరుకావడం, నియమిత కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయడం జరుగుతోంది. ఎక్కడికి కదలకుండా ఉన్నచోట నుండే ఉన్నత చదువులు పూర్తి చేసే సౌకర్యం ఈ సాంకేతిక విప్లవం కాలంలో సాధ్యపడుతుంది. ఈ విధానానికి డిజిటల్ యూనివర్శిటీలు తోడ్పడుతాయి. ఇది డిజిటల్ యుగం. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండి వీలైనంత తక్కువ ధరలో కంప్యూటర్ టాబ్ కొనగలిగితే కొండల్లో, కోనల్లో ఉన్నా ఎంటెక్ లాంటి ఉన్నత సాంకేతిక విద్య కూడా ఈ రోజుల్లో సాధించవచ్చు. మన కేంద్ర ప్రభుత్వం పోయిన బడ్జెట్‌లోనే కేంద్రీయ డిజిటల్ విశ్వవిద్యాలయం కోసం రూ. 4 కోట్లు కేటాయించింది. ఆ మొత్తంతో ఎలాంటి పురోగతి లేకపోవడంతో తాజా బడ్జెట్‌లో రూ. 100 కోట్లు నేషనల్ డిజిటల్ యూనివర్శిటీ ఏర్పాటుకు అందిస్తోంది. పార్లమెంట్‌లో యాక్ట్ ద్వారా కేంద్రం జాతీయ డిజిటల్ వర్శిటీని నెలకొల్పాలి. అప్పుడే ఆ యూనివర్శిటీ కోర్సులు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాదిలో ఇది సాధ్యపడవచ్చు. డిజిటల్ యూనివర్శిటీలో కోర్సుల నిర్వహణ, విద్యా బోధన, పరీక్షలు అన్ని డిజిటల్ మాధ్యమంలోనే జరుగుతాయి. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధారంగా వర్చువల్ మోడ్‌లో సర్వం సాధ్యపడుతుంది. హబ్ అండ్ స్పోక్స్ దీనికి మూలాధారం. హబ్ అంటే నిర్వహణ కేంద్రం, స్పోక్స్ అంటే ఈ వ్యవస్థను సమన్వయ పరిచే విద్యా సంస్థలు. కేంద్ర విద్యా శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖల సమన్వయంతో ఇది ఏర్పాటవుతుంది. దేశంలో విశ్వవిద్యాలయాలకు పెద్ద అయిన యుజిసి ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలోని ఆన్‌లైన్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను ఆధునీకరించాలనే సంకల్పం యుజిసికి ఉంది. ఆ సంస్థ ముందుకొచ్చిందంటే డిజిటల్ చదువుకు అన్ని రకాల గుర్తింపు లభించినట్లే. ఇప్పటికే దేశ పౌరులకు వివిధ సేవలు అందిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ వ్యవస్థను అనుసంధానం చేస్తారు. ఈ కోర్సుల్లో చేరడానికి కనీస విద్యార్హత ఉంటే చాలు. ప్రవేశానికి ఎలాంటి ఎంట్రన్స్ పరీక్షలు ఉండవు. కోర్సు పూర్తికి నిర్ణీత గడువు కాలం ఉండదు. భాషా మార్పు సాంకేతికత అందుబాటులో ఉన్నందున ప్రాంతీయ, మాతృభాషల్లో బోధనను పొందవచ్చు. ఫీజులు తక్కువగా ఉంటాయి. పైగా ఈఎంఐ విధానంలో కిస్తులుగా చెల్లించే సదుపాయం కల్పిస్తున్నారు. ముందుగా దేశంలోని ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో, న్యాక్ గ్రేడింగ్‌లో వందలోపు రేటింగ్ వచ్చిన విద్యా సంస్థలను యుజిసి ఎంపిక చేసి అందులోని బోధనను, కోర్సులను డి యు విద్యార్థులకు అందే ఏర్పాట్లు చేస్తుంది. దీని ద్వారా ఒక గొప్ప విద్యా సంస్థలో అడ్మిషన్ లభించకున్నా అదే కోర్సును డిజిటల్ ప్లాట్ ఫారం ద్వారా పూర్తి చేయవచ్చు. డిజిటల్ యూనివర్శిటీ కోసం యుజిసి కేవలం టాప్ కాలేజీలను ఎంపిక చేస్తున్నందువల్ల ఆయా క్లాసుల్లో విద్యార్థులు వినే లెక్చర్లు వీరికి లభిస్తాయి. తద్వారా డియులో అవే కోర్సుల్లో చేరి ఎంతో మంది నిష్ణాతులు, నిపుణులుగా తయారయ్యే అవకాశం ఉంది. యువతలో నైపుణ్య లేమి అంతరించి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగితను గణనీయ స్థాయిలో తగ్గించవచ్చు. దేశంలోకి వస్తున్న ప్రపంచ స్థాయి కంపెనీల మానవ వనరుల అవసరాన్ని తీర్చే స్థాయికి యువత ఎదిగే అవకాశం ఉంది. విశాలమైన మన దేశంలో గ్రామీణ ప్రాంతమే ఎక్కువ. పేదరికం వల్ల, రవాణా సౌలభ్యం లేనందువల్ల ఏ మూలాన ఏ ప్రతిభ ఉందో తెలియదు.

అన్ని ప్రాంతాల శక్తిసామర్థ్యాలు బయటకు రావడం ఇప్పటి అవసరం. ఇది డిజిటల్ చదువు వల్లే సాధ్యపడుతుంది. డిజిటల్ యూనివర్శిటీకి కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం కావడం ముఖ్యావసరం. దేశంలో 90 కోట్ల మంది ఇంటర్నెట్ వాడుతున్నా భౌగోళికంగా 52% ప్రాంతానికి మాత్రమే ఆ సౌకర్యం లభిస్తోంది. ఇది మరింత విస్తరించవలసి అవసరం ఈ విద్యా విధాన విజయంతో ముడిపడి ఉంది. బ్రాడ్ బాండ్ శక్తి కూడా పెరిగి నెట్ వేగవంతం కావాలి. ఈ దిశగా కూడా ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేసి సమాచార ఛత్రాన్ని విస్తరింపజేసి ఈ చదువుకు తోడ్పడాలి. ప్రస్తుతం మన దేశంలో రెండు రాష్ట్రాల్లో డిజిటల్ యూనివర్శిటీలు ఉన్నాయి. డియు యాక్ట్ ద్వారా కేరళలో 2020లో ఒకటి ఏర్పాటైంది. దీనిలో 3 ఎంటెక్, 5 ఎంఎస్సి, 2 ఎంబిఎ కోర్సులు ఉన్నాయి. 2022లో రాజస్థాన్ ప్రభుత్వం జోధ్ పూర్‌లో రాజీవ్ గాంధీ ఫిన్‌టెక్ డిజిటల్ ఇన్‌స్టిట్యూట్‌ని ప్రారంభించింది. కేంద్రం నిర్వహణలో ఏర్పడే జాతీయ డిజిటల్ యూనివర్శిటీకే జాతి అవసరాలను తీర్చే స్తోమత ఉంటుంది.

# నారాయణ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

### సాంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు
### ఆకట్టుకున్న చిన్నారుల వేశధారణలు
### నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ కోహిత





మిర్యాలగూడ, జులై 27 (తీన్మార్ న్యూస్): మిర్యాలగూడ పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఆషాడ మాసము సందర్భంగా బోనాల పండగ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ కోహిత అమ్మ వారికి జ్యోతి ప్రజ్వలన చేసి బోనం ఎత్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు బోనాలు ఎత్తుకుని పులివేశాలు, పోతురాజుల వేషాలు ధరించి డప్పు సప్పుల్ల కొలహాలంతో సందడి చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు బోనాల ను అమ్మ వారికి సమర్పించి భక్తి శ్రద్దలతో బోనాల పండగను జరుపుకున్నారు ఉపాధ్యాయులు బోనాల పండగ విశిష్టత గురించి పిల్లలకు వివరించారు. అనంతరం



పిల్లలు తమ నృత్యలతో అందరిని ఆకట్టుకున్నారు. వేడుకలను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆషాడం మాసంలో జరిగే బోనాల పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ ప్రజలు బోనాల పండుగలో పాల్గొని మొక్కులు తీర్చుకుని కృతజ్ఞతగా అమ్మవారిని వేడుకుంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి బోనం కుండను మోస్తూ తెలంగాణ జానపద నృత్యాలను ప్రదర్శిస్తూ వివిధ రూపాలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు అందుకు ఎంతో సంతోషంగా ఉంది అని అన్నారు. విద్యార్థులు ఆచార సంప్రదాయాలు, తెలంగాణ విలువల పై అవగాహనతో ఉండాలన్నారు. ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో జరుపుకునే సంస్కృతి, సంప్రదాయాలకు, విలువెత్తు నిదర్శనం బోనాల పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సైదిరెడ్డి, ఏడి వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్స్ అనూష, శ్వేత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### గ్రామ ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్ఐ శివకుమార్

వనపర్తి నియోజకవర్గం, జూలై 27 (తీన్మార్ న్యూస్): సైబర్ నేరాలకు యువత బలై, లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. బయటికి ఎవరికి చెప్పుకోలేక, లోపల ఆత్మహత్య చేసుకొని విలువైన నిండు జీవితాలను పోగొట్టుకుంటున్నారని పెద్దమందడి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈ.శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ. ఈ.శివకుమార్ మాట్లాడుతూ ఆన్లైన్ ఫేక్ కంపెనీలు వివిధ వెబ్సైట్ల పేరుతో నిర్వహించే కంపెనీలో పెట్టుబడులు పెడితే, వాటికి రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశ జూపి గ్రామీణ ప్రాంతాల ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. మహబూబ్నగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలో ఆన్లైన్ వేక్ యాప్ ద్వారా, ఒక్క గ్రామంలోనే 60 నుండి 80 మందికి పైగా బాధితులు, ఓ వెబ్సైట్ ఫేక్ కంపెనీలో రూ, లక్షలో పెట్టుబడి పెట్టి మోసపోయారు అన్నారు. వివిధ గ్రామాల్లో యువకులు దాదాపు రూ, కోటి వరకు అప్పు చేసి, ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టి మోసపోవడం బయటికి వచ్చి నిర్భయంగా చెప్పలేక, లోలోపల మదన పడిపోతున్నారు. సంబంధించిన వెబ్సైట్ కంపెనీ నుంచి వారం రోజులుగా ఇలాంటి లావాదేవీలు నిర్వహించకుండా నిలిచి పోవడంతో ఒక్కసారిగా పెట్టుబడులు పెట్టిన వారంతా లబో దిబో అంటున్నారని ఎస్ఐ. ఈ.శివకుమార్ అన్నారు. ఎవరికి చెప్పుకోలేక తమలో తాము మధన పడుతున్నారని, ఈ విషయంలో పోలీసులకు తెలియజేయడానికి వెనుకడుగు వేస్తున్నారని ఎస్ఐ. ఈ.శివకుమార్ అన్నారు. సైబర్ నెరగాళ్ళు మొదటగా 800 రూ, నుండి లక్ష వరకు పెట్టుబడి పెట్టిన డబ్బులకు ప్రతిరోజు కొంచెం డబ్బులు ఆశ చూపి వారి అకౌంట్లో జమ చేసేవారు అన్నారు. రోజా అకౌంట్ లో డబ్బులు జమ కావడంతో, వారిలో ఆశలు పెరిగి, మొదటిసారిగా మూడు వేలు, అత్యాశకు 25 వేల నుండి 75 వేల వరకు ఇలా అప్పులు చేసి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టారు. వారం రోజుల కింద కంపెనీ ఆకర్షణీయ మైన బహుమతులు ప్రకటించడంతో బాధితులు మరింత ఉత్సాహంతో పెట్టుబడులు పెట్టడమే కాకుండా, తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారికి సమాచారం ఇవ్వడం జరిగింది. పెట్టుబడి పెట్టిన వాళ్లంతా అత్యాశకు



పోయి భారీ మొత్తంలో డిపాజిట్ కూడా చేయడం జరిగింది. మొదట చెప్పిన ప్రకారం ఇవ్వడానికి 24 గంటల్లో బాధితులకు ఖాతాలో జమ కావాల్సి ఉండగా, నాలుగు రోజులైనా ఒక రూపాయి కూడా డబ్బు జమ కాకపోవడంతో కంపెనీకి సంబంధించిన వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టే పనిలో ఉన్నారు. ఒకేసారి వెబ్సైట్ మూసివేస్తే, కస్టమర్లకు అనుమానం వస్తుందని, ఏదో ఒక ఆశ చూపుతో ఒకరిద్దరి అకౌంట్లో డబ్బులు వేస్తున్నారని బాధితులు బహిరంగంగానే చెప్తున్నారు. ఇలాంటి మోసాల బారిన పడిన వెంటనే 1930కు వెంటనే కాల్ చేసి చెప్పాలని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఈ.శివ కుమార్ తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరికి యువతీ యువకులకు అవగాహన ఉండాలని, కేంద్ర ప్రభుత్వం అమ్మల్లోకి తీసుకొచ్చిన, మూడు కొత్త క్రిమినల్ చట్టాల పై అవగాహన పెంపొందించుకోవాలని, ఎస్ఐ.శివకుమార్ సూచించారు. మూడు కొత్త చట్టాలతో సమకాలీన కాలంతోపాటు,వాడుకులో ఉన్న సాంకేతికతను అనుగుణంగా అనేక కొత్త నిబంధనలను చేర్చినట్లు వెల్లడించారు. ఈ కొత్త చట్టాలకు 2023 డిసెంబర్ 21న పార్లమెంట్లో ఆమోద%శీ% లభించినందు వల్ల, కొత్త చట్టాల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే నకిలీ విత్తనాలు అమ్మితే, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ.హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం చే గుర్తించిన విత్తనాలను డీలర్లు మాత్రమే అమ్మాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే, నాసిరకం పురుగు మందులు అమ్మితే సీరియస్ యాక్షన్ తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను మోసం చేసే దళారులను గుర్తించి వెంటనే స్థానిక పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని, రైతులు తాము కొనుగోలు చేసినవిత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రసీదు తప్పకుండా తీసుకోవాలని పెద్దమందడి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈ.శివకుమార్ అన్నారు.

# సిఎంఆర్ వికేంద్రీకృత గోడౌన్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



గోవిందరావు పేట, జులై 27 (తీన్మార్ న్యూస్): శనివారం గోవిందరావు పేట మండలంలోని ఆధునిక వ్యవసాయ గోదాం మార్కెట్ యార్డులో సిఎంఆర్ వికేంద్రీకృత గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24



ఖరీఫ్ కింద సీఎంఆర్ బియ్యం రైస్ మిల్లర్ల ద్వారా పంపిణీ చేయబడినవి వికేంద్రీకృత గోదాం నందు అనుమతించటం కొరకై ఇట్టి గోదామును ప్రారంభించడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎం. డిసిఎస్ఓ రాం పతి, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టిలు కార్మికులకు మెరుగైన సౌకర్యాలకు చర్యలు

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు, జులై 27 (తీన్మార్ న్యూస్): ఇటుక బట్టిలు, నిర్మాణ స్థలములో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శనివారం ములుగు మండలం బండారుపల్లి గ్రామంలో గల ఎ.ఆర్ ఇటుక బట్టిని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లా సహాయ కార్మిక అధికారి వి.వినోద తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటుక బట్టిలో పనిచేస్తున్న ఒడిసా, చత్తీస్ ఘడ్ కు చెందిన 8 మంది కార్మికలను వారి యొక్క సమస్యలు, వేతనము వివరములు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గల ఇటుక బట్టిలు, నిర్మాణ స్థలములో పనిచేస్తున్న కార్మికులకు పనిప్రదేశంలలో మెరుగైన సౌకర్యాలు, కార్మికుల యొక్క పిల్లల సంరక్షణకు వసతి ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు



సమర్పించాలని సహాయ కార్మిక అధికారిని ఆదేశించారు. నిర్మాణ రంగం సంబందించిన కార్మిక సంఘాల నాయకులతో వచ్చే వారం సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

# కల్మలచెరువు ప్రాథమిక పాఠశాలలో దుస్తుల పంపిణీ



### ఏఏపీసి అధ్యక్షురాలు సంధ్యారాణి

గరిడేపల్లి, జూలై 27 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండలంలోని కల్మలచెరువు గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏఏపీసి అధ్యక్షురాలు సంధ్యారాణి చేతుల మీదుగా రెండవ జత దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగినది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ ఉచితంగా ఇస్తూ మరియు మధ్యాహ్న భోజనం కల్పించడం జరుగుతుంది. గ్రామంలో ఉన్నటువంటి ప్రజలు ఈ యొక్క సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ గ్రంథాలయ చైర్మన్ ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ సైదులు, ఎస్ శ్రీను, జి విజయలక్ష్మి, టి రేణుక విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం



వనపర్తి నియోజకవర్గం, జూలై 27 (తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు తెలుగు పండితుడు, బి.గిరిరాజాచారి చిట్యాల జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ కావడంతో పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శాంతన్న ఆధ్వర్యంలో, పెద్దమందడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం బదిలీపై వెళ్లిన బి.గిరిరాజాచారికి పూలమాల, శాలలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థులు కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి. సుదర్శన్ గౌడ్. జగదీష్ బాబు. సాయి చందర్ రెడ్డి. శ్యాంసుందర్. కేశవులు. సంజీవ్. బాలస్వామి. శ్రీధర్. బద్రి నాయక్. హనుమంతు నాయక్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తను పరామర్శించిన బిజెపి రాష్ట్ర నాయకులు




ఆత్మకూరు, జులై 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కుమ్మరి రాజు బైక్ మీద నుంచి అదుపుతప్పి కింద పడి గాయాలు కావడం జరిగింది. ఇట్టి సమాచారం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి బిజెపి కార్యకర్త కుమ్మరి రాజులు కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు హరీష్, మండల ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ బిజెపి జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్ బిజెపి సీనియర్ నాయకులు వెంకటరములు గ్రామ అధ్యక్షులు అంజి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ గ్రంథాలయ చైర్మన్





ములుగు, జులై 27 (తీన్మార్ న్యూస్): శనివారం ములుగు మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశ్వర్లు మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పిన మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ వారి వెంట ఎక్స్ ఎంపీటీసీ సత్యనారాయణ రావు సర్పంచ్ మాలోతు రవీందర్ బుల్లెట్ ఓదేలు చిన్న మల్హాల్ రావు అప్పాజీ ఐలయ్య లింగంపల్లి సంపత్ రావు కల్తీ రంజిత్ ప్రతిని కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.

# ఆర్టీసీ కార్గో వేగంగా సురక్షితంగా ప్రజలకు చేరువగా

### ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగచేసుకోవాలి రీజియన్ సేల్స్ టీం



మహబూబ్ నగర్ జిల్లా, జులై 27(తీన్మార్ న్యూస్): ఆర్టీసీ కార్గో వేగంగా సురక్షితంగా ప్రజలకు చేరువగా ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో సేవలను పార్శిల్ తక్కువ ఖర్చుతో అతి తక్కువ సమయంలో భద్రంగా రవాణా సేవలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ రీజియన్ సేల్స్ టీంపృధ్వీరాజ్, శ్రీనివాస్, శరత్, రాజ్ కుమార్, మసూద్ సూచించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలోని నూతనంగా ఆర్టీసీ కార్గో ఏజెంట్ రాములు ఆధ్వర్యంలో ఎస్బిఐ ఎదురుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాజిస్టిక్స్ (కార్గో) సేవల నుండి సానుకూల స్పందన మరియు మంచి లాభాలతో ప్రోత్సహించబడిన తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ శనివారం ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీస్‌ను మదనాపురం మండలం ప్రజలు అందుబాటులో తెచ్చామని కోరారు. దీని లక్ష్యం తక్కువ సమయంలో వారి గమ్యస్థానాలకు పార్సెల్‌లను డెలివరీ చేయడమని అన్నారు. ఈ సేవలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లోని అన్ని జిల్లాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలలోపు పార్శిల్ పికప్ పెడితే, అదే రోజు రాత్రి 9 గంటలకు అది గమ్యస్థానానికి చేరుకుంటుందని, మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య పికప్ పెడితే,మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలలోపు డెలివరీ అవుతుంది అని తెలిపారు. తక్కువ సమయంలోనే తెలంగాణ ఆర్టీసీ కార్గో, పార్శిల్ సేవలు వినియోగదారుల ఆదరణతో, అందరి సమిష్టి కృషితోనే సాధ్యమైందని కోరారు. కార్గో, పార్శిల్ సేవలు దినదినాభివృద్ధి చెందుతుందని, తక్కువ సమయంలోనే ప్రజలకు చేరువైందన్నారు. సంస్థకు కండక్టర్లు, డ్రైవర్లే నిజమైన రథసారథులని కితాబిచ్చారు. కార్గో, పార్శిల్ సేవల్ని వినియోగిస్తున్న వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులు పార్శిల్, కార్గో సేవల్ని మరింత ఆదరించి సంస్థ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

# జిల్లా కేంద్రంలో రోడ్లు ఆక్రమించిన షాప్స్ యజమానులు

### బండ్లు, ఆటోలు, డబ్బాలు, పట్టించుకోని అధికారులు వత్తాసు పలుకుతూ జేబులు నింపుకుంటున్న కొందరు ప్రజా ప్రతినిధులు

### చర్యలు తీసుకోని సవరించాలని డిమాండ్ చేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక

వనపర్తి నియోజకవర్గం, జూలై 27 (తీన్మార్ న్యూస్): గత కౌన్సిల్ లో కొన్ని రోడ్లను సెలెక్ట్ చేసి సుందరీకరణ పేరుతో అభివృద్ధి చేయాలని 20 కోట్లు బ్యాంక్ అప్పుగా తీసుకున్న మున్సిపాలిటీ. జిల్లా కేంద్రానికి వచ్చిన పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ అట్టహాసంగా ప్రారంభించేసి వెళ్లారు.అయితే వాటి పేరుపై రాజీవ్ చౌక్ నుండి డిపో వరకు, బస్టాండ్ పక్క నుండి సివి రామన్ కాలేజ్ వరకు రోడ్లు మాత్రమే వేయడం జరిగింది. అయినా 60 ఫీట్ లో 40 ఫీట్ల రోడ్లను వేశారని ప్రజలు సంతోషపడ్డారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ రోడ్ల లో ప్రజలు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఆక్రమించుకున్నారు. కొందరు షాప్ యజమానులు,బహుళ అంతస్తుల కు ట్రాన్స్ ఫారంలు, మరికొందరు తమ షాప్ లో పెట్టే సామాన్లు మొత్తం రోడ్డుపైనే పెట్టి ఆక్రమించారు. కొందరు ప్రజా ప్రతినిధులు డబ్బులు తీసుకుని డబ్బాలను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. బహుళ అంతస్తులలో షాపింగ్ మాల్, హాస్పిటల్, పెద్ద పెద్ద షాపులకు పార్కింగ్ ప్లేస్ లేకుండానే అనుమతి ఇవ్వడంతో రోడ్లపైనే ఆటోలు, బండ్లు, టూ వీలర్స్ పెట్టడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కమిషనర్ ఇతర అధికారులకు ఫోన్ చేస్తే పట్టించుకోవడం లేదు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లతో కొందరు డబ్బాలతో డైరెక్ట్ గా డబ్బులు తీసుకుంటున్నారని అపవాదు కూడా ఉంది. దీన్ని పూర్తిగా పరిశీలించి వనపర్తి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారిని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది. వనపర్తిలో కొందరు ప్రజా ప్రతినిధులు పూర్తిగా వీటిపైనే సంపాదిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు బ్రోకర్లు ఒక జట్టుగా తయారై వనపర్తిలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటూ మేమే అంతా అనుకుంటూ చెప్పుకుంటూ తిరుగుతూ, వీటి వెనుక ఉన్నారని, పాలిటెక్నిక్ ఎదురుగా ఒకవైపు రోడ్డు వెడల్పు 40 చేశారు ఇంకోవైపు 40 ఫీట్లు చేయకుండా 34 ఫీట్లకే చేసారు ఆ స్థలంలోనే మళ్లీ పార్కింగ్ పేరుతో వెహికల్స్ నిలబెడితే రోడ్డు మొత్తం 20 ఫీట్ల గాని ఉంది. అక్కడ కొందరు రాజకీయ నాయకుల కోసం విడిచి పెట్టారనీ అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి

### సొంత నిధులతో రూ. 5 లక్షలతో హైమాక్స్ లైట్లు ఏర్పాటు

### ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన గ్రామ ప్రజలు



ఆత్మకూరు, జులై 27 (తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండలం లంకల గ్రామంలో గత సంవత్సరం గణేష్ చవితి ఉత్సవాల పూజా కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆనాడు గ్రామానికి ఐమాక్స్ లైట్లు కావాలని లంకల గ్రామ ప్రజలు కోరగా ఐదు కూడలిలో ఐదు హైమ్యాక్స్ లైట్లను దాదాపు 5 లక్షల విలువగల తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నేడు తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి తన సొంత నిధులతో గ్రామ ప్రజలు పార్టీలకు అతీతంగా స్వాగతించి తన వెంట కదిలి గ్రామంలోని అన్ని కూడలిలో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి హైమాక్స్లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జి లక్ష్మారెడ్డి, వెంకట్రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రత్నాకర్ రెడ్డి, బాలస్వామి రామకృష్ణ విజయ్, అజిత్ రెడ్డి, తదితర నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# హామీలు ఇచ్చారు బడ్జెట్ కేటాయింపులు మరిచారు

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు



ఆత్మకూర్, జులై 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిస్థాయి బడ్జెట్ ఈనెల 25న ప్రవేశపెట్టగా. అనేక సంక్షేమ రంగాలకు బడ్జెట్ కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో పేర్కొన్న ఉపాధి పని దినాలు 100నుంచి 150 కి పెంచుతామని రోజు కూలి 400 చెల్లిస్తామని. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 భరోసా అందిస్తామని. బడ్జెట్లోకేవలం 902కోట్లు నిధులుమాత్రమే వెచ్చించి%శీ%దని విమర్శించారు. ప్రజా పాలనలో భూమి లేని పేదలు పెట్టుకున్న దరఖాస్తుల ఆధారంగా నిధులుపెంచాలని, అదేవిధంగా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాలకు 22500 కోట్లు అవసరం ఉండగా ఈ బడ్జెట్లో కేవలం. 8424 కోట్లు కేటాయించడం ఏమాత్రం సరిపోవని అన్నారు. చేయూత పథకం కింద అన్ని రకాల ఆసరా పెన్షన్లను రెట్టింపు చేస్తామన్న హామీకి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని దుయ్యబట్టారు. పాలమూరు యూనివర్సిటీ 160 కోట్లు ప్రతిపాదనలు పంపితే 12 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతినెల మహిళల అకౌంట్లోకి నేరుగా 2500.జమ చేస్తామన్న హామీకి కూడా నిధులు కేటాయించకపోవడం మహిళల పట్ల వివక్ష చూపినట్లుగా అర్థమవుతున్నదని అన్నారు. కౌలు రైతులకు కూడా ఏడాదికి15000 ఇస్తామన్న నేటికీ కౌలు రైతులకు గుర్తింపుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో కౌలు రైతులువిస్మయం వ్యక్తం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో 420 హామీలను ఇచ్చి అత్యధిక హామీలకు సరిపడా నిధులను ఈ బడ్జెట్ లో కేటాయించకపోవడంతో. హామీల పట్ల ఉన్న శ్రద్ధ అమలులో బడ్జెట్ లేకపోవడం కేవలం ఎన్నికల్లో గెలుపు కొరకే హామీలు ఇచ్చిన విధంగా ప్రజలకు అర్థమవుతుందని వివరించారు కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోసించి. ఉపాధి ఇందిరమ్మ ఇండ్లు కౌలు రైతులు భూమిలేని కూలీలకు ఆసరా పెన్షన్లు రెట్టింపు మహిళల ఆర్థిక భరోసా తదితర పథకాలకు ప్రాధాన్యత నిస్తూ బడ్జెట్ కేటాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శేఖర్ హన్మంతు విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయ సంకేతమే లక్ష్యం

### బిజెపి కార్యకర్త సమావేశంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి






ఆత్మకూర్, జులై 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం తిప్పడం పల్లి గ్రామంలో స్థానిక గ్రామస్థాయి బిజెపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయసంకేతం దిశగా కార్యకర్తలు కట్టుబడి పని చేయాలని,కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని కార్యకర్తలకు పలు సూచన సలహాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ రేచింతల శ్రీను, పార్లమెంట్ కోకన్వీనర్ బురుజు భూమిరెడ్డి, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ అశోక్, నారాయణ, ఆత్మకూర్ ఓబీసీ నాయకులు అశోక్ భూపాల్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లన్న, నరేందర్ గౌడ్, సహదేవు వేణు, బాలరాజు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

### అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దు

### స్వచ్ఛందంగా పునరావాస కేంద్రానికి ప్రజలు తరలి రావాలి



ములుగు, జులై 27 (తీన్మార్ న్యూస్): విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితిలో తప్ప ప్రజలు బయటికి రావద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అన్నారు. శనివారం కన్నాయిగూడెం మండలం కంతాన్‌పల్లి 2వ లోలెవల్ వంతెన, గోవిందరావు పేట మండలంలోని రాఘవపట్నం దయ్యాల వాగు వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా తరలించాలని కలెక్టర్ సూచించారు. వరదల నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు కల్పించాలని అధికారులను సూచించారు. గోదావరికి ఎగువనున్న నుండి వచ్చే వరదకు వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహించనున్న నేపథ్యంలో తహశీల్దార్ లు, ఎంపిడివో లు తమ మండల పరిధిలోని రోడ్లు, గ్రామాలు జలమయ మయ్యే ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో వుంటూ, ఎటువంటి ఆటంకాలు కలగకుండా తక్షణమే పర్యవేక్షించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఉధృతంగా ప్రవహిం చే వాగుల వద్ద సంకేత బోర్డ్ లు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కొరారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతో రోడ్లు తెగిపోయిన, ఉధృతంగా ప్రవహించేనా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని, రెండు దిక్కులా బారికేడ్లు, ప్లాస్టిక్ కోన్స్, ట్రెడ్ మరే ఇతర పరికరాలు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా చూడాలన్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ఆవకాశం ఉంటుదని కాబట్టి రోడ్డు రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ అధికారులు విధ్యుత్, ఆర్ బీ శాఖ అధికారుల సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రోజెక్ట్ లలోని నీటి మట్టాలను ఎప్పటి కప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పంచాయితీ సెక్రటరీ లు సైతం తమ పరిధిలోని చెరువుల నీటి మట్టాలను గమనిస్తూ, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రారంభించి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు.గ్రామ స్థాయి అధికారులు, పంచాయ తీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐకేపీ సీసీలు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి జ్వరాలు, డెంగ్యూ, ఇతర కేసులను గుర్తించి తక్షణమే జాగ్రత్తలు తీసుకుని వైద్య సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేయాలన్నారు. నీటిపారుదల శాఖ సిబ్బంది ఏ ఈలు వారి వారి పరిధిలోని చెరువులను తనిఖీ చేయాలి. సందర్శించిన ఫోటోలను సమర్పించాలని, ఏదైనా అత్యవసర మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టి పూర్తి చేయాలి. ఈఈ ల ద్వారా నివేదికలను సమర్పించాలన్నారు. గోదావరి వరద నీటి మట్టం పెరుగుతోందని, ఈ వరద వల్ల ప్రభావితమయ్యే గ్రామాలు, రహదారుల గురించి, సమాచారం ప్రజలకు చేరవేయాలి. ఆ ప్రాంతం లో రవాణా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ముంపు ప్రాంతాల ప్రజలు ఎగువ సురక్షిత ప్రదేశానికి తరలించాలి. వర్షాలు మరియు పారిశుద్ధ్యం, ఆరోగ్య సమస్యల పరంగా రానున్న 2 రోజులు మరింత క్లిష్టమై నవి. అధికారు లందరూ అప్రమత్తంగా ఉండాలని, ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి తేవాలని ఆదేశించారు. సాయక చర్యలు జిల్లా యంత్రాంగ మంతా అప్రమత్తంగా ఉన్నారని ప్రజలు సహకరించాలని, ప్రజల అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు ఐటిడిఏ ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్. 6309842395. ల్యాండ్ లైన్ నెంబర్ 08717-293246 లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమాయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ,తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బడుగు బలహీనవర్గాలపై దళిత సంఘాల ఆరోపణ అవాస్తవం

### బతకండి - బతకనివ్వండి

### మెపా మరియు ముదిరాజ్ సంఘాల డిమాండ్



హన్మకొండ, జులై 27 (తీన్మార్ న్యూస్): నర్సంపేట మెపా డివిజన్ ఆఫీసులో మెపా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇటీవల నర్సంపేట పట్టణంలో పెండ్యాల యాదగిరి, మండల శ్రీనివాస్ తదితరులకు సంబంధించిన భూమికి తగిన ఆధారాలు ఉన్నప్పటికి కొందరు దళిత సంఘాల నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అని బీసీ, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల పైన కావాలని కుట్ర పూరిత ఆరోపణలు మానుకోవాలని ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న బీసీ ముదిరాజ్ లని అణగదొక్కాలని చూస్తే సహించేది లేదని అన్నారు. మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టిల ఎదుగుదల కోసం ఇచ్చిన అట్రాసిటీ చట్టంను దుర్వినియోగ పరచకుండా మంచి కోసం ఉపయోగించాలని మంచి కోసం పెట్టిన చట్టాలను అణగారిన బీసీల పైన ప్రయోగించి లాభపడడం సరికాదని దానిని అడ్డం పెట్టుకొని భయపెట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మన బోయిన అశోక్, మండల శ్రీనివాస్, శీలం చంద్ర మోహన్, శీలం రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# శిక్షా సప్తాహ్‌లో విద్యార్థుల నైపుణ్యాలకు అభినందనీయం





గరిడేపల్లి, జూలై 27 (తీన్మార్ న్యూస్): శిక్షా సప్తాహ్‌లో విద్యార్థుల నైపుణ్యాలకు అభినందనీయం. శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం - 2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 22 నుండి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నైపుణ్య ప్రదర్శనలను తిలకించి అభినందించారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధత వెలికితీయడమే శిక్షా సప్తాహ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ శిక్షా సప్తా ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శత్రు నాయక్, ఎంపీడీవో శ్యాంసుందర్ రెడ్డి ఎపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువులో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య!



హైదరాబాద్: పెళ్లి విషయంలో గర్ల్‌ఫ్రెండ్, కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడి ఎక్కువవడంతో తట్టుకోలేకపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ముషీరాబాద్‌కు చెందిన బాలాజీ (25) మాదాపూర్ నాలెడ్జ్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న ఆఫీసుకు వెళ్లిన బాలాజీ రాత్రి పొద్దుపోయినా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో, ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అతడి స్నేహితులను కనుక్కున్నా బాలాజీ జాడ తెలియరాలేదు. దీంతో, వారు మరుసటిరోజు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బాలాజీ పనిచేస్తున్న కంపెనీలో విచారించగా అతడు ఆ రోజు పని ముగించుకుని రాత్రి 8.30 గంటలకు బయటకు వెళ్లినట్టు తెలిసింది. దీంతో, సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు అతడు కేబుల్ బ్రిడ్జి నుంచి దుర్గం చెరువులోకి దూకినట్టు గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం సాయంత్రం చెరువులో అతడి మృతదేహం లభించింది. ఐడీ కార్డుతో మృతుడిని బాలాజీగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా, బాలాజీ కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. యువతి పెళ్లికోసం ఒత్తిడి చేయగా ఈ విషయాన్ని బాలాజీ తన ఇంట్లోవారికి చెప్పలేక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

# భారత శాస్త్ర విజ్ఞానగని భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం

### మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ, జులై 27 (తీన్మార్ న్యూస్): బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని పులి రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం సేవలు ఈ దేశం మరవదు మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆయన కీర్తి అజరామరం అణు ఆయుధ రూపకల్పనలో, క్షిపణుల తయారీలో ఆయన కృషి ప్రపంచానికే మార్గదర్శమైంది. ఆయన జీవితం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. శాస్త్రసాంకేతిక రంగాల్లో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలిపిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, సీనియర్ నాయకులు నయీమొద్దీన్, జానకీ రాములు, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, మాలకుమ్మరి పరుశురాములు, రాజు, రాజ్‌కుమార్, ఖలీల్, ఇస్మాయిల్, అనిల్, ప్రశాంత్, రాకేష్ యాదవ్, చాగంటి రమేష్, మహేష్, రఘు, వరుణ్, హరి కృష్ణ తరితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఎల్బీ స్టేడియంలో సీఎంకు కృతజ్ఞత సభ

**- పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో నిర్వహణ**
**- వేం నరేందర్‌రెడ్డితో ఉపాధ్యాయ సంఘాల సమావేశం**
**- ఆగస్టు 15 తర్వాత డీఏ విడుదల**
**- విద్యాశాఖ అధికారులతో ప్రాధాన్యతల వారీగా సమస్యలపై చర్చ**
**- ఆ తర్వాత రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం**



హైదరాబాద్: రాష్ట్రంలో పదోన్నతులు పొందిన సుమారు 20 వేల మంది టీచర్లతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞత సభ, ఉపాధ్యాయుల సమ్మేళనాన్ని నిర్వహించాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టిన విషయం తెలిసిందే. వారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత చెప్పే సమ్మేళనాన్ని నిర్వహించాలని భావించింది. సీఎం అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత దీన్ని నిర్వహించే అవకాశమున్నది. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్‌తో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో), తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీటీజేఏసీ) ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వచ్చేనెల మూడున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లడానికి ముందే బదిలీలు, పదోన్నతులు సజావుగా నిర్వహించడంపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి ధన్యవాదాలు తెలుపుతారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి విద్యాశాఖ అధికారులతో ముందు చర్చించాలని నిర్ణయించారు. ప్రాధాన్యతల వారీగా సమస్యలను క్రోడీకరించి అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వాటిని పరిష్కరించాలని కోరే అవకాశమున్నది.

# గుండ్ల వాగు ప్రాజెక్టును సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



గోవిందరావుపేట, జులై 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ దనసరి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచన మేరకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గుండ్ల వాగు ప్రాజెక్టును సందర్శించిన ఇటుక్ ఐఎన్టీసీయూ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రాజెక్టును సందర్శించిన శ్రీనివాస్ మాట్లాడుతు ప్రాజెక్టు యొక్క ఎడమ, కుడి కాలువలను మరమ్మత్తులను అదేవిధంగా తూముల యొక్క మరమ్మత్తుల కోసం మరియు కట్ట యొక్క రివిటింగ్ లను పరిశీలించడం జరిగింది అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు రైతులకు గాని రైతుల సమస్యల పట్ల ఎలాంటి చర్యలు తీసుకోకుండా అనేక ప్రాజెక్టులను మరమ్మతులను పరిశీలించకుండా గాలికి వదిలేసి ఉండిపోయారు కానీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల కోసం ఇలా పోరాడాడో అదేవిధంగా నేడు మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కూడా రైతుల పట్ల సమస్యలపై ఇలాంటి ఇబ్బందులు కలగాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికప్పుడు గ్రామాలలో ఉండే ప్రాజెక్టుగానీ బ్రిడ్జిలు, వాగులను నాయకులను అధికారులను ఎప్పటికప్పుడు పరిశీలించమని చెప్పారు. ఏవైనా మరమ్మతులు ఉంటే మంత్రి సీతక్క కి తెలియజేసి పనులను పూర్తి చేస్తామని అని చెప్పడం జరిగింది. అలాగే ములుగు జిల్లా అభివృద్ధి బాటలో నడవడానికి సీతక్క గారివల్ల అవుతుంది అని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారామ్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి, చల్వాయి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ గారు, చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్

**- కూలీల భరోసాకు నిధులు లేని రాష్ట్ర బడ్జెట్**
**- అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం: ప్రధాన కార్యదర్శి బి.వెంకట్**



హైదరాబాద్: భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను, పోడు భూములను పంపిణీ చేయడం ఇళ్ల స్థలాలు కేటాయించడం వంటి భూ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విస్మరించాయని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కూలీలకు సంబంధించి ఆర్భాటంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో నామమాత్రపు నిధులను కేటాయించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చారని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధికి కేంద్రం అదనపు నిధులు కేటాయించేలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మ్యాచింగ్ గ్రాంట్‌గా 10 శాతం నిధులను కేటాయించాల్సి ఉన్నా%ా% ఒక్క పైసా కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్రం కేటాయించిన నిధుల్లో ఎక్కువ భాగం గత బకాయిలకే పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నాలుగు నెలలకు పైగా చేసిన పనికి కూలీలకు బకాయిలు చెల్లించ లేదని గుర్తుచేశారు. పని దినాలను పెంచుతామనీ, రోజు కూలీ కూడా రూ. 400 ఇస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకోసం బడ్జెట్లో కేటాయించిన రూ. 8,424 కోట్లు ఏ మూలకు సరిపోవని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు కూలి భరోసా కింద రూ.902 కోట్లు బడ్జెట్లో చూపారని రాష్ట్రంలో ఎంతమంది వ్యవసాయ కార్మికులు ఉన్నారనే లెక్క ప్రకటించలేదని తప్పుపట్టారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని వాగ్దానం చేసి బడ్జెట్లో ఒక పైసా కేటాయించలేదనీ, కౌలు రైతులకు రూ.15 వేలు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ బడ్జెట్లో వారి పేరే ఉచ్చరించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహిళలకు 2500 రూపాయలు ప్రకటనకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపల ఈ అంశాలపై పునర్‌పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి సాగునీరు అందించాలి: సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం



నల్గొండ కలెక్టరేట్: డిండి ఎత్తిపోతల పథకం డిపిఆర్‌ను ఆమోదించాలని, ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తికి , మూసీ ఆధునీకరణకు తగిన నిధులు కేటాయించాలని, సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్. వీరయ్య, జి. నాగయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగంగా డిండి, ఎత్తిపోతల పథకం నిర్మాణం చేసి క్షామ ఫ్లోరిన్ పీడిత ప్రాంతాల్కైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని సుమారు 3.61 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు జి.వో. 107 ను గత 2015న విడుదల చేశారని గుర్తు చేశారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడ్ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టును స్థిరికరించారని, దాని కింద కొన్ని నిధులు మంజూరు చేసి సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టిరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నాయని, కానీ గత ప్రభుత్వం డిపిఆర్‌ను ఆమోదించలేదని తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసం లేఖ రాయలేదని, దీంతో ఈప్రాజెక్టు విషయమై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని ముఖ్యమంత్రి కి తెలిపారు. తమ ప్రభుత్వమైనా వెంటనే పాలమూరు %-% రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎదుల్లా రిజర్వాయర్ నుండి రోజుకు 0.5 టిఎంసి చొప్పున 60 రోజుల పాటు 30 టిఎంసిలు నీటిని తీసుకునే విధంగా డిపిఆర్‌ను అమోదించాలని, పర్యావరణ అనుమతుల గురించి ప్రభుత్వం వెంటనే లేఖ రాసి త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయుటకు తగిన నిధులు కేటాయించాలని కోరారు.

**లిఫ్టుల నిర్వహణ ప్రభుత్వానిదే..**

నాగార్జునసాగర్ ఎడమ కాలువపై ఉన్న 43 లిఫ్టుల పైపులు దెబ్బతినడం, మోటర్లు మరమ్మతులకు రావడం వల్ల ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉన్నదని, ఆపరేటర్ల జీతభత్యాలను రైతులు భరించలేక పోతున్నారని, లిఫ్టుల మరమ్మతులు, ఆపరేటర్ల జీతభత్యాలతో పాటు లిఫ్టుల పూర్తి నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని అన్నారు. నల్లగొండ జిల్లాలో సుమారు 3.20 వేల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు సాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు 19 సంవత్సరాల క్రితం 1925 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన పనులు నేటికి 4658 కోట్ల అంచనా వ్యయానికి చేరిందని అన్నారు. 9.5 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉన్నదని బడ్జెట్‌లో కేటాయించిన రూ. 800 కోట్లు సరిపోవని, ఎక్కువ నిధులు ఇచ్చి పూర్తికి కాలపరిమితి నిర్ణయించి, పర్యవేక్షణ కమిటీని వేయాలని కోరారు. 2.20 టిఎంసిల నీటి సామర్థ్యం కలిగిన పెండ్లిపాకల ప్రాజెక్టు పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయని, దీని కింద 950 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. పెండ్లిపాకల ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు.

**మూసి ప్రాజెక్టులు తగ్గుతున్న నీటి సామర్థ్యం**

1963లో 4.6 టిఎంసిల నీటి సామర్థ్యంతో మూసీ ప్రాజెక్టును నల్లగొండలో నిర్మించారని, కానీ దాంట్లో ఇసుక చేరడంతో క్రమంగా నీటి సామర్థ్యం తగ్గుతుందని చెప్పారు. మూసీ ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువలు శిధిలము కావడం, షట్టర్లు లేకపోవడంతో ల్కైనింగ్ చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరటం లేదని చెప్పారు. మూసీలోకి వచ్చే నీరు కాలుష్యంతో ఉండటం వలన అవి తాగిన ప్రజలు, పశువులు చివరికి పండించిన పంటలలో కూడా కాలుష్యం చేరడం వలన ఆనారోగ్యానికి గురౌతున్నామని, ప్రజల్లో ఆందోళన ఉన్నారని తెలిపారు. కాలుష్య నివారణ చర్యలు చేపట్టడం, మూసీని ఆధునీకరించి సుందరీకరణ చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచి నిధులు కేటాయించాలని కోరారు.

# మహిళా హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

కరీంనగర్: అనేక సంవత్సరాలుగా మహిళా హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని, హక్కుల కోసం మరోమారు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా రాష్ట్ర స్థాయిక రాజకీయ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభ సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆస్తి హక్కు కల్పించాలని, లైంగిక వేధింపులు అరికట్టాలని అనేక చట్టాలు సాధించుకున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల మూలంగా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో మహిళలను విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మహిళలు పౌష్టికాహార లోపంతో రక్తహీనతకు గురవుతున్నారని, పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నిర్భయ, అత్రాస్, మణిపూర్ ఘటనలే ఇందుకు నిదర్శనమని అన్నారు. దేశానికి బంగారు పథకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ లైంగికంగా వేధించారని, బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం దుండగులకు వత్తాసు పలకడం సిగ్గుచేటు అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ధరలను అరికట్టాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అభినందనీయమని, దాంతోపాటు మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.2500 వెంటనే ఇవ్వాలని అన్నారు. గ్యాస్ సబ్సిడీ కొద్దిమందికి మాత్రమే వస్తోందని, పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన మహిళలకు కేటాయించాలని, ఆ ఇండ్లకు కరెంటు, రోడ్లు, తాగునీటి, డ్రెయినేజీ వ్యవస్థలు పూర్తి చేయాలని కోరారు. ఇండ్ల స్థలం, ఇల్లు లేని వారికి, ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నేడు మండలంలో ఉచిత వైద్య శిబిరం

### శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి:డా.కేఎం భాష

పెబ్బేరు, జూలై 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలోని నసీం ప్రథమ చికిత్స కేంద్రం వద్ద అదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డా.కేఎం భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరానికి కర్నూల్ కు చెందిన నడుము మరియు నొప్పి చికిత్స ప్రముఖ వైద్యులు హాజరై ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# సిటీ పోలీస్ లలో నయా దందా

హైదరాబాద్: హైదరాబాద్ సిటీ పోలీస్‌శాఖలో కొందరు అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు అధికారులే అక్రమార్కులకు చీకటి వ్యవహారాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తమకు సంబంధం లేని విషయాల్లో తలదూరుస్తూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో జంట నగరాల్లో పలువురు పోలీసు అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ కీలక జోన్‌లో ఉన్నతాధికారి వ్యవహారశైలి డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. ఆయనతో వేగలేమంటూ దిగువస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులకు లిఖిత పూర్తక ఫిర్యాదులు చేస్తున్నారంటే?. ఆయన ఎంతలా సతాయిస్తున్నారో అర్థమవుతోందంటున్నారు. ఆ ఉన్నతాధికారి తీరుతో న్యాయం కావాలంటూ వచ్చేవారికి అన్యాయమే ఎదురవుతోందంటున్నారు. సదరు అధికారి పనిచేస్తున్న కీలక జోన్‌లో భూముల విలువ ఎక్కువ. నిత్యం ఏదో ప్రాంతంలో ల్యాండ్ కబ్జా తగాదాలు చెలరేగుతూనే ఉంటాయి. ఇలాంటి కేసుల్లో బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారి సెటిల్‌మెంట్లను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బాధితులు, కబ్జాదారుల మధ్య పంచాయితీ చేస్తూ అందినంత దోచుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇక ఫ్యామిలీ గొడవలను కూడా ఆ అధికారి వదలడం లేదట? భార్యభర్తల తగాదాల్లోనూ డబ్బులే చూస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇక ఇటీవల నగరంలో హత్యలు, దోపిడీలు వంటి నేరాలు పెరిగిపోయాయి. లా ఆర్డర్ అదుపు చేయడానికి నగరంలో రాత్రి పది గంటలు అయ్యేసరికి హోటల్స్, రెస్టారెంట్లు క్లోజ్ చేయాలని సిటీ పోలీసు శాఖ ఆదేశాలిచ్చింది. కానీ, ఆ అధికారి పర్యవేక్షణలో ఉన్న జోన్‌లో ఈ అదేశాలు అమలు కావడం లేదు. అర్ధరాత్రుల వరకు హోటల్స్, రెస్టారెంట్లు తెరచుకుంటూనే ఉన్నాయి. పలు వివాదాలకు కేంద్రంగా మారుతు న్నాయి. ఆయా షాపుల నుంచి ఆ అధికారి మామూళ్లు వసూలు చేస్తుండటం వల్ల ఎవరూ ప్రశ్నించలేకపోతున్నారంటున్నారు. ఇక ఎవరైనా దిగువ స్థాయి అధికారులు షాపులు, రెస్టారెంట్లు మూయించాలని చూస్తే? వాటి జోలికి వెళ్లొద్దంటూ సదరు అధికారి నేరుగా హుకుం జారీ చేస్తున్నారంటున్నారు. అంతేకాకుండా రౌడీ మూకలకు వత్తాసు పలకడం, ఎవరైనా కింద స్థాయి సిబ్బంది తన మాట వినకపోతే? టార్గెట్ చేసి వేధించడంతో ఆ జోన్‌లో పనిచేయడమంటేనే దిగువస్థాయి సిబ్బంది హడలిపోతున్నారంటున్నారు. ఇటీవల కాలంలో ఆ జోన్‌లో వరుస హత్యలు చోటు చేసుకుంటున్నా.. ఆ అధికారి అస్సలు పట్టించు కోవడం లేదంటున్నారు. ఇన్ని ఆరోపణలు ఉన్న ఆ అధికారికి స్థానికంగా అధికార పార్టీ నేతలతో సత్సంబంధాలు ఉండటం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారంటున్నారు. మొత్తానికి ఆ అధికారి వల్ల సిటీ పోలీసులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# జమ్ములో 55 మంది ఉగ్రవాదులు...

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలు మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం పాక్‌లో శిక్షణ పొందిన 55 మంది ఉగ్రవాదులు కశ్మీర్‌లో ఉన్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఉగ్రమూకల భరతం పట్టేందుకు భారత సైన్యం భారీ ఆపరేషన్‌కు వ్యూహరచన చేసింది. ఉగ్రవాదుల ఏరివేతకు ఇప్పటికే 500 మంది పారా కమాండోలను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. ఆ ఉగ్రవాదులను హతమార్చడమే లక్ష్యంగా 'ఆపరేషన్ సర్ప్ వినాశ్ 2.0 ను ఇండియన్ ఆర్మీ ప్రారంభించింది. 21 ఏళ్ల తర్వాత కశ్మీర్ లోయలో ఆర్మీ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదే. ప్రధాన మంత్రి కార్యాలయం స్వయంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తోంది. ఈ ఆపరేషన్‌లోని ముఖ్య అధికారులు నేరుగా జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. గడచిన 32 నెలల్లో జమ్మూలోని వివిధ చోట్ల జరిగిన ఉగ్రదాడుల్లో 48 మంది సైనికులు అమరులయ్యారు. ఆయా ఉగ్రదాడులు, వాటి వెనక ఉన్న కీలక ముష్కరుల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసిన ఆర్మీ... జవాన్ల త్యాగాలు వృథా కాకూడదన్న ఉద్దేశంతో ఈ భారీ ఆపరేషన్ చేపడుతోంది. అలాగే, తీవ్రవాదులదాడులతో భయం గుప్పిట్లోకి జారుకుంటోన్న సాధారణ పౌరుల్లో ధైర్యం నింపేందుకు ఇప్పటికే ఆర్మీ చర్యలు చేపట్టింది. కీలక ప్రాంతాల్లో 200 మంది స్నైపర్లు, 500 మంది పారాకమాండోలతో కలిసి దాదాపు 4 వేల అదనపు బలగాలను మోహరించింది. దేశంలోని ఇతర భద్రతా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ భారత సైన్యం ఆర్మీ ఈ ఆపరేషన్‌కు వ్యూహరచన చేసింది. ఇందులో స్థానికులను కూడా ఇందులో భాగస్వాములను చేయడం చెప్పుకోదగ్గ అంశం. 1995-2003 మధ్య జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఆటకట్టించడంలో కీలక పాత్ర పోషించిన విలేజ్ డిఫెన్స్ గార్డ్స్ ( ఎఆఉబ) సాయాన్ని కూడా సైన్యం కోరింది. స్థానిక పరిస్థితులు, ఎదురయ్యే సవాళ్ల గురించి వీరికి పూర్తి అవగాహన ఉంటుంది. ఉగ్రవాదుల ఏరివేతతో పాటు వారికి సహకరిస్తోన్న నెట్‌వర్క్‌లను కూడా ఈ ఆపరేషన్ ద్వారా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉగ్రవాదులకు ఆహారం, ఆయుధాలు సమకూరుస్తూ, ఆశ్రయం కల్పిస్తూ క్షేత్రస్థాయిలో వారికి సహకరించే నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని ఇండియన్ ఆర్మీ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ ఆపరేషన్ జమ్ములోని దోడా, కథువా, ఉధంపుర్, రాజౌరీ, పూంచ్, రియాసీల్లో కొనసాగుతోందని ఆయన చెప్పారు. హిట్ లిస్టులో ఉన్న 55 మంది ఉగ్రవాదులు ఈ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, జమ్మూను ఉగ్రవాద కేంద్రంగా మార్చాలనుకుంటున్న పాక్ పన్నాగాన్ని భగ్నం చేయాలనే కృతనిశ్చయంతో భారత సైన్యం ఉందని పేర్కొన్నారు.

# కోరుట్లలో కారు కష్టాలు...

కరీంనగర్: మ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ కంచుకోట కోరుట్ల నియోజకవర్గం. వరుసగా నాలుగు ఎన్నికల్లో ఆ పార్టీయే గెలిచింది. 2009లో కోరుట్ల నియోజకవర్గం ఏర్పడితే ఇప్పటివరకు ఆ పార్టీయే గెలుస్తూ వస్తోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా?. జగిత్యాల, కోరుట్లలో కారు పార్టీ జోరు చూపింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ గూటికి చేరిపోగా..కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాత్రం కారు దిగనంటూ మొండికేస్తున్నారట. దీంతో ఆపరేషన్ కోరుట్లను మొదలు పెట్టింది కాంగ్రెస్. బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల విద్యాసాగర్ కుటుంబానికి మంచి పట్టున్న ఈ నియోజకవర్గంలో ఇప్పుడు కొత్త సవాల్ ఎదుర్కొంటోంది. 2009లో తొలిసారి గెలిచినా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ క్యాడర్? 2014 నుంచి అధికారం అనుభవించడంతో ఇప్పుడు ప్రతిపక్ష పాత్రలో ఇమడలేకపోతున్నారు. గత ఏడాది పార్టీ అధికారం కోల్పోవడంతో ద్వితీయ శ్రేణి నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ పునాదులే షేక్ అవుతున్నాయంటున్నారు. ఇలా ముఖ్యమైన నేతలు అంతా కారు దిగేస్తుండటం సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కు తలనొప్పిగా మారింది. రోజురోజుకూ కండువాలు మార్చే వారి సంఖ్య పెరుగుతుండటంతో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరుగుతోంది. బీఆర్ఎస్ డీలా పడుతోంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కు క్యాడర్ ను నిలుపుకోవడం సవాల్ గా మారింది. గతంలో ఆయన తండ్రి విద్యాసాగర్ రావు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో సంజయ్ కు చాన్స్ వచ్చింది. ఐతే గెలిచిన తొలిసారి ఆయన ప్రతిపక్షానికి పరిమితం కావడంతో క్యాడర్ ను కట్టడి చేయలేకపోతున్నారంటున్నారు. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ పెద్ద ఎత్తున చేపట్టగా, సంజయ్ మాత్రం ఆకర్ష్ కు ప్రభావితం కాలేదని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో మంచి సంబంధాలు ఉండటంతో బీఆర్ఎస్ లో కొనసాగేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఐతే ఇక్కడ కాంగ్రెస్ ప్లాన్ బీ అమలు చేస్తూ?. కోరుట్లలో కారును గ్యారేజ్ కు పంపేలా కార్యకర్తలపై ఫోకస్ చేసింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన జువ్వాడి నరసింగరావుకు కోరుట్లలో పూర్తి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటం.. నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే కన్నా జువ్వాడి మాటే చెల్లుబాటు అవుతుండటంతో గులాబీశ్రేణులు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయట. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పునాదులను గట్టిపరచుకోవాలనే ఉద్దేశంతో చురుగ్గా పావులు కదుపుతున్నారు జువ్వాడి నరసింగరావు. బీఆర్ఎస్ క్యాడర్ ను తనవైపు తిప్పుకుంటూ?. ఎమ్మెల్యేకు సవాల్ విసురుతున్నారు. మాజీ మంత్రి దివంగత రత్నకరరావు వారసుడిగా రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నరసింగరావు? ఇప్పటివరకు గెలవలేకపోయారు. కానీ, పార్టీ అధికారంలో ఉండటంతో ఇన్చార్జిగా కోరుట్ల రాజకీయాన్ని ఇప్పుడు శాసిస్తున్నారు.

కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తో సహ పలువురు కౌన్సిలర్లను కాంగ్రెస్ లోకి చేర్చుకున్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ లో చేరేలా పావులు కదిపారు. మొత్తానికి నియోజకవర్గంలో ప్రధానమైన పట్టణాల్లో పట్టు సాధిస్తూ ఒక్కో అడుగే వేస్తున్నారు జువ్వాడి నర్సింగరావు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రాబల్యం కనిపించేలా పావులు కదుపుతున్న జువ్వాడి నరసింగరావు? ఎమ్మెల్యే సంజయ్‌కు చుక్కలు చూపిస్తున్నారంటున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ జోరుకు కళ్లెం వేసేలా ఎమ్మెల్యే ఎలా ముందుకు వెళతారనేది ఆసక్తిరేపుతోంది.

# రేవంత్ లో రెండో యాంగిల్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో ఎన్నడూ చూడని రెండో యాంగిల్ కాంగ్రెస్ నేతలకు షాకిస్తోంది. అధికారం చేపట్టి తొలి రోజు నుంచి సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో చాలా క్లోజ్‌గా వ్యవహరిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఈ మధ్య సహచరులపై రుసరుసలాడుతున్నారని గాంధీభవన్ టాక్. ఏడు నెలలుగా ప్రభుత్వాన్ని నడుపుతున్న సీఎం? ఎప్పుడూ సహచరులతో చాలా స్నేహ సంబంధాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రజా ప్రభుత్వంగా చెబుతూ మంత్రులకు ప్రాధాన్యమివ్వడంతో పాటు.. ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా బాగా ప్రోత్సహించేవారు. కానీ, ఈ మధ్య సీఎంలో కాస్త మార్పు కనిపిస్తోందంటున్నారు. కొందరు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్న సీఎం.. వారికి క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. కొందరికి చీవాట్లు పెట్టిన సీఎం.. ఇకపై సీరియస్‌గా పని చేయాలని మాస్ వార్నింగ్ ఇవ్వడం కాంగ్రెస్ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. అందరితో ఫ్రెండ్లీగా మాట్లాడే సీఎం ఒక్కసారిగా సీరియస్ కావడంతో నేతలు కూడా అవాక్కయారట. ప్రభుత్వ మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారని.. ప్రతి దానికి సీఎంగా తానే మాట్లాడాల్సి రావడం మంచిది కాదని సహచర మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారట సీఎం రేవంత్‌రెడ్డి. కొందరు మంత్రుల శాఖలపై ఆరోపణలొచ్చినా కూడా స్పందించకపోవడమేంటని నిలదీశారట సీఎం. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేసే విమర్శలపై ఎమ్మెల్యేలు మాట్లాడకుండా మౌనంగా ఉండటమేంటని సీఎం క్లాస్ తీసుకోవడంతో వారంతా కంగుతిన్నారంటున్నారు. కొద్ది రోజులుగా ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. విద్యార్థి, నిరుద్యోగుల అంశాన్ని బేస్ చేసుకొని బీఆర్ఎస్ నేతలు ప్రతిరోజూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఇక బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి సైతం ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు టాక్స్ వసూలు చేసి ఢిల్లీకి పంపుతున్నారని మంత్రులపై ప్రతిరోజూ ఆరోపణలు చేస్తున్నా? మంత్రులు, ప్రభుత్వ విప్‌లు ఎవరూ పట్టించుకోవడం లేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారట. ప్రతిరోజూ ప్రభుత్వంతోపాటు మంత్రులను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నా, ప్రత్యర్థులను లైట్‌గా తీసుకోవడంపై సీఎం క్లాస్ పీకినట్లు సమాచారం. సోషల్ మీడియాలో సైతం ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుంటే ఇంతమంది ఎమ్మెల్యేలు ఉండి కూడా కౌంటర్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని సీఎం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. కొందరు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలను సచివాలయానికి పిలిపించుకొని మాట్లాడిన సీఎం.. ప్రతిపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోలేకపోవడంపైనే క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజు నుండి ఎంతో నిబద్ధతతో పనిచేస్తుంటే.. దాన్ని చెప్పుకోవడంలో విఫలమవుతున్నామని భావిస్తున్న సీఎం.. సహచరులకు బాధ్యత ఉండాలని క్లాస్ పీకడంపై విస్తృత చర్చ జరుగుతోంది. కొన్ని విషయాల్లో ప్రభుత్వం సైలెంట్‌గా ఉండేసరికి సోషల్ మీడియాలో ప్రతిపక్షాలు రెచ్చిపోతున్నాయని, ఇక ఉపేక్షించేది లేదని సంకేతాలివ్వాలని సహచరులకు సూచించారట సీఎం..బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై గులాబీ పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న అంశం కూడా చర్చకు వచ్చింది. నిరుద్యోగుల అంశాన్ని సాకుగా చూపిస్తూ బీఆర్ఎస్ నేతలు రాహుల్ గాంధీపై సెటైర్లు వేస్తున్న అంశం ప్రస్తావనకు వచ్చిందని చెబుతున్నారు. ఇంత జరుగుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు డ్యామేజ్ కంట్రోల్ చేయడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు సీఎం? ప్రతిపక్షాలు పనిగట్టుకొని ప్రభుత్వంపై బురద చల్లుతుంటే ప్రభుత్వం తరఫున స్పందించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు ఏమీ పట్టనట్లు ఉండడం భావ్యం కాదని క్లాస్ తీసుకున్నారు ముఖ్యమంత్రి. అన్నింటికి తానే మాట్లాడాలా? మీరంతా ఏం చేస్తున్నారు? ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తుంటే చూస్తూ కూర్చుంటారా? స్పందించాల్సిన అవసరం మీకు లేదా? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సీఎం హోదాలో ఉండి ప్రతి విమర్శపైనా తాను స్పందించలేనని.. ఈ మాత్రం కూడా మీకు తెలియదా అంటూ సహచర మంత్రులు, ఎమ్మెల్యేలకు చురకలు పెట్టారట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఇక నుంచి అవసరాన్ని బట్టి అందరూ మాట్లాడాల్సిందేనని సీఎం ఆదేశించారట. ఎవరు ఏం చేస్తున్నారో తనకి తెలుసని, తమకు అంటీ ముట్టనట్లు ఎవరైనా ఉంటే వారిని ఏం చేయాలో తనకు తెలుసని సీఎం స్వీట్ వార్నింగ్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్ మంత్రుల్లో మార్పు కనిపిస్తోందని అంటున్నాయి గాంధీభవన్ వర్గాలు.. సీఎం క్లాస్ పీకిన తర్వాతనే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతల విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు మీడియా ముందుకు వస్తున్నట్లు చెబుతున్నారు.

# స్వయం సహాయక సంఘాల డబ్బులు తీసుకుని పరారైన వి వో ఏ

## లబోదిబోమంటున్న మహిళలు

భద్రాద్రి కొత్తగూడెం: జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామానికి చెందిన మహిళలు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన గ్రామదీపిక మరియు బ్యాంక్ మిత్ర అయిన దుర్గారావు అనే వ్యక్తి మహిళా సంఘాల వద్ద నెల నెల పొదుపు డబ్బులు బ్యాంక్ లో జమ చేయడానికి వసూలు చేసి బ్యాంక్ మిత్ర కూడా అతనే కావడంతో అతని దగ్గరే ఉంచుకుని సుమారు 8 నెలల పాటు సుమారు 25 లక్షల రూపాయలు బ్యాంక్ లో జమ చేయకపోవడంతో సదరు సంఘాలకు చెందిన మహిళలకు బ్యాంక్ నుండి అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనితో నోటీసులు అందుకున్న మహిళలు ఒక్కసారిగా షాక్ తిన్నారు. ఇవ్వేకుండా స్త్రీ నిధిలో జమ చేయాల్సిన 25 లక్షల రూపాయలు కూడా జమ చేయకపోవడంతో లబోదిబోమంటున్నారు. రోజు వారీ కూలి పనులు చేసుకుంటూ డబ్బులు పొదుపు చేసుకోవడానికి బ్యాంక్ మిత్రాకు చెల్లిస్తే బ్యాంక్ లో జమ చేయకపోగా తిరిగి తమకే బ్యాంక్ అధికారులు నోటీసులు ఇవ్వడం ఏంటని సుజాతనగర్ మండలం సుజాతనగర్ ఏపిజివిబి బ్యాంక్ కు వెళ్లి గొడవకు దిగారు. గతంలో బ్యాంక్ లో జమ చేయలేదని తెలిసి విఓఏ అయిన దుర్గారావు ను నిలదీయడంతో బ్యాంక్ అధికారులే అతనికి సమయం ఇవ్వండి అని బ్రతిమిలాడి తీరా ఇప్పుడు అతను కనిపించకుండా పరారు కావడంతో మమ్మల్ని డబ్బులు కట్టాలి అని నోటీసులు ఇవ్వడం అన్యాయం అంటూ ఆగ్రహించారు. దీనితో బ్యాంక్ కు కొత్తగా వచ్చిన మేనేజర్ వారితో మాట్లాడి పై అధికారులకు సమాచారం ఇచ్చి విచారణ జరిపి న్యాయం చేస్తామని తెలపడంతో మహిళలు అక్కడి నుండి సుజాతనగర్ పోలీసు స్టేషన్ కు వెళ్లి దుర్గారావు పై ఫిర్యాదు చేశారు.

# ఘోరం..పోర్న్‌ని చూసి సోదరిపై బాలుడి లైంగికదాడి, హత్య..

హైదరాబాద్ : మధ్యప్రదేశ్ దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో రేవాలో 13 ఏళ్ల బాలుడు, 9 ఏళ్ల తన సోదరిపై లైంగికదాడి చేసి, ఆమెను హత్య చేసిన సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. ఈ హత్యను ఛేదించడానికి 3 నెలల్లో 50కి పైగా డీఎన్ఏ టెస్టులు నిర్వహించగా, బాలిక ప్రయివేటు పార్టులో దొరికిన వీర్యం డీఎన్ఏ ఆమె అన్నయ్యతో సరిపోలింది. ఈ కేసులో తలదించుకునే విషయం ఏంటంటే, నిందితుడిని రక్షించేందుకు తల్లి, ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రయత్నించారు. ఈ కేసులో వీరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం రేవాలోని జావా ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. నిందితుడు రాత్రి వేళల్లో మొబైల్ ఫోన్లలో పోర్న్ చూడటానికి అలవాటు పడ్డాడు. తన మంచం పక్కన నిద్రిస్తున్న సోదరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తండ్రికి చెబుతానని బెదిరించడంతో, బాలికను హత్య చేశాడు. ఈ కేసులో పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు



55 మంది డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. అయితే, మైనర్ శరీరంలో అభించిన డీఎన్ఏ ఎవరితోనూ సరిపోలతేదు. చివరకు బాలిక ప్రయివేటు పార్టులో దొరికిన స్పెర్మ్ డీఎన్ఏ నిందితుడైన ఆమె అన్నతో సరిపోలింది. నిందితుడు లైంగికదాడి చేసినట్లు అంగీకరించాడు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. వీరంతా అతడిని రక్షించే ప్రయత్నం చేశారు.

# వెజిట్రబుల్స్......

## ఏ కూరైన రూ.50 పైనే

హైదరాబాద్: కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. సామాన్యులకు అందనంతా దూరంగా రేట్లు భారీగా పెరిగిపోయాయి. ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ. 50కి పైనే చెబుతున్నారు. ఇక టమోటాల రేట్లకైతే మళ్లీ రెక్కలు వచ్చాయి. కిలో టమోటా రేటు వంద రూపాయలను మరోసారి టచ్ చేయడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. దీంతో ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లేదు అని వినియోగదారులు నిట్టూరుస్తున్నారు. టమాటతో పాటు.. అన్ని రకాల కూరగాయలు రూ.50 నుంచి 80 వరకు అమ్ముడవుతున్నాయి.. దీంతో ప్రజలు కర్రీ వర్రీ అంటూ తంటలు పడుతున్నారు. కాగా.. టమాట ధరలు పెరగడంతో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. రైతు బజార్లలో కిలో 48 రూపాయలకే ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది ఏపీ ప్రభుత్వం. మార్కెటింగ్ శాఖ ద్వారా విశాఖలోని 13 రైతు బజార్లలో కిలో 48 రూపాయలకు టమోటా అమ్మకాలు చేపట్టారు. దీంతో సబ్సిడీ కౌంటర్లకు భారీగా క్యూ కడుతున్నారు ప్రజలు. ఇక తెలంగాణలో కూడా వెజ్ ట్రబుల్స్ కనిపిస్తున్నాయి. కూరగాయల రేట్లు.. జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. ఏ కూరగాయ కొందామన్నా కిలో వంద అంటూ షాక్ ఇస్తున్నారు వ్యాపారులు. భారీ వర్షాల కారణంగా రవాణాపై ప్రభావం పడడంతో, కూరగాయలు రేట్లు పెరిగాయని చెబుతున్నారు. టమోటా కిలో 100, పచ్చి మిర్చి కిలో వంద,చిక్కుడు కిలో 120, క్యారట్ కిలో వంద, కాకర కిలో 90, కేలిఫ్లవర్ కిలో 80 రూపాయలు పలుకుతున్నాయి. ఇక ఆకుకూరల రేట్లు కూడా మండిపోతున్నాయి. గతంలో మూడు వందల రూపాయల కూరగాయలు కొనుగోలు చేస్తే వారం రోజులకు సరిపోయేవి. ఇప్పుడు కనీసం రెండు రోజులకు కూడా సరిపోవడం లేదని జనం నిట్టూరుస్తున్నారు. కూరగాయల రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇక కరీంనగర్‌లో స్థానికంగా కూరగాయల సాగు కూడా తగ్గింది. దీంతో దిగుమతులపై ఆధార పడాల్సి వస్తోంది. ఇక ఉల్లి రేటు కూడా ఘాటెక్కింది. అన్ని రకాల కూరగాయల ధరలు పెరుగుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. భారీ వర్షాల వల్లే రేట్లు పెరుగుతున్నాయంటున్నారు వ్యాపారులు. హైదరాబాద్‌లో కూడా కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. వర్షాలకు పంటలు దెబ్బతినడం.. సమయానికి పంట చేతికి అందకపోవడంతో దిగుబడులు తగ్గి కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కిలో టమోటా వంద రూపాయలకు చేరడంతో.. దానికి సామాన్యులు టాటా చెప్పే పరిస్థితి వచ్చింది. రైతు బజార్లలో కూడా టమోటాలను సబ్సిడీ రేట్లకు అమ్మడం లేదని వినియోగదారులు కంప్లయింట్ చేస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌కు 6 వేల క్వింటాళ్ల టమాటాలు వస్తుంటాయి.. ప్రస్తుతం 2.5 నుంచి 3వేల క్వింటాళ్లే వస్తున్నాయి. దీంతో టమోటాకు డిమాండ్ పెరిగి ధర కొండెక్కింది.

# లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలి

సిటీ: లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శుక్రవారం జోనల్ అడిషనల్ కమిషనర్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీఆర్ఎంపీ ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించిన ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్‌కు డిసెంబర్ వరకు గడువు ఉండటంతో పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్



పనులను పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే ఏజెన్సీలతో జోనల్ స్థాయిలో సమీక్ష చేసి ఒప్పందం చేసుకునే విధంగా ఏమైనా గ్యాప్ ఉంటే వెంటనే పనులు చేయించాలని చెప్పారు. డెంగ్యూ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. దోమలతో వచ్చే వ్యాధులతో పాటుగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులు దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిల్స్ వారీగా పూర్తి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

# ఇద్దరు మిత్రులు... చెరో దారి

హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అనూహ్యామైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటి వరకూ కలసి నడుస్తున్నారని భావించిన వైఎస్ఆర్‌సీపీ, బీఆర్ఎస్ రాజకీయం చెరో దారిలో వెళ్లడం ప్రారంభించాయి. కారణం ఏదైనా తెలంగాణ ఉద్యమ సమయంలో వైసీపీ .. బీఆర్ఎస్‌కు రాజకీయ శత్రవు కంటే ఎక్కువ. మహబూబాబాద్ లో జగన్ పర్యటనను అడ్డుకుని రాళ్ల దాడి చేసి మరీ వెనక్కి పంపేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత అంతా మారిపోయింది. బీఆర్ఎస్, వైసీపీ ఫ్రెండ్స్ అయ్యాయి. ఇరువురూ ఉమ్మడి శత్రువుగా టీడీపీని తీసుకుని.. తమదైన వ్యూహాలను అమలు చేస్తూ రాజకీయం చేస్తున్నారు. బీఆర్ఎస్, వైసీపీకి వచ్చే సీట్లతో ఢిల్లీలో చక్రం తిప్పవచ్చని రెండు పార్టీల నేతలు అనుకున్నారు. గతంలో ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఏపీకి ప్రత్యేకహోదా కోసం పోరాడతానని కేసీఆర్ కూడా చెప్పారు. అయితే ఢిల్లీ రాజకీయ పరిణామాలు వీరి పార్టీలకు ఎప్పుడూ అనుకూలంగా మారలేదు. దీంతో అవకాశం కోసం ఎదురు చూస్తూ వచ్చారు. కానీ రాజకీయాల్లో ఎప్పుడూ సక్సెస్‌లే కాదు.. ఎదురు దెబ్బలూ ఉంటాయి కాబట్టి ఇప్పుడా పరిస్థితిలోకి ఒకే సారి రెండు పార్టీలు వచ్చాయి. తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు కోసం వైసీపీ నేతలు గట్టిగానే ప్రయత్నించారు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఏపీలో వైసీపీ గెలుస్తుందని తమకు సమాచారం ఉందని పదే పదే ప్రచారం చేసినా ..వైసీపీకి కాలం కలసి రాలేదు. దీంతో జాతీయ రాజకీయల్లో తమ పాత్రేమీ లేకుండా అయిపోయింది. బీఆర్ఎస్, వైసీపీలకు ఇప్పుడు తమకో అండ ఉండాలని జాతీయ స్థాయిలో ఎవరి రాజకీయాలు వారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ అని వార్యంగా బీజేపీకి బీఆర్ఎస్ దగ్గరవుతోంది. అంతే అనివార్యంగా కాంగ్రెస్ కు జగన్ దగ్గరవుతున్నారు. బీజేపీ నుంచి తన పార్టీకి పొంచి ఉన్న పెను ముప్పు నుంచి తప్పించుకునేందుకు, కవితను జైలు నుంచి బయటకు తెచ్చేందుకు బీఆర్ఎస్ కు మరో మార్గం కనిపించడం లేదని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. అందుకే బీజేపీతో విలీన ఫార్ములాపై చర్చించి వచ్చారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇంప్లిమెంట్ చేయడమే మిగిలింది. అందులో భాగంగానే బీజేపీపై విమర్శలు చేయడం లేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నా.. బీఆర్ఎస్ నేతలు నోరు మెదపడం లేదు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు ఏమీ రాలేదని రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారు కానీ బీజేపీని పల్లెత్తు మాట అనలేదు. అసెంబ్లీలోనూ అదే వరుస. రాష్ట్ర బడ్జెట్‌ను చీల్చి చెండాడుతానని అటున్న కేసీఆర్ .. కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నిస్తూంటే.. స్పందించడం లేదు. వైసీపీ ఇప్పుడు కాంగ్రెస్ కూటమి వైపు వెళ్తోంది. షర్మిల రూపంలో ఏపీ కాంగ్రెస్ వైసీపీకి ముప్పుగా మారుతుందన్న స్పష్టత రావడంతో కాంగ్రెస్ కూటమి వైపు వెళ్లిపోతున్నారు. ఇండీ కూటమి వైపు వెళ్లానని చెప్పడానికే ఆయన ఢిల్లీ ధర్నాను ఉపయోగించుకున్నారని ఎవరికైనా అర్థమవుతుంది. ఇప్పుడు బీజేపీకి ఏ బిల్లుకూ మద్దతు తెలుపలేరు. అలా చెబితే రాజకీయాల్లో ఇతర పార్టీల నేతలు ఆయనను నమ్మరు. అన్నీ ఆలోచించే ఆయన ఇండీ కూటమి నేతల మద్దతు తీసుకున్నారు. ల బీజేపీకి ఆయన మరోసారి దగ్గరయ్యే అవకాశాలు లేవు. అంటే బీఆర్ఎస్ బీజేపీ వైపు జగన్ కాంగ్రెస్ వైపు వెళ్తున్నారు. ఇద్దరికీ వచ్చే పార్లమెంట్ సీట్లతో జాతీయ రాజకీయాలను దున్నేయాలన్నది కేసీఆర్, జగన్ ప్లాన్ . కానీ చివరికి రెండు పార్టీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు వారికి అనువైన మార్గాల్లో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. భవిష్యత్ లో కాలం కలసి వస్తే.. మళ్లీ కలిసేంత స్నేహం మాత్రం కొనసాగించనున్నారు. కాలం కలసి వచ్చినప్పుడు వారి అనివార్యతల్ని పక్కన పెట్టి రాజకీయాలు చేసేందుకు మాత్రం ఓ దారి ఉంచుకునే అవకాశం ఉందనేది ఎక్కువ మంది నమ్మే అంశం.

# వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ, ఏడీ రాజేందర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి.

**అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని ఉరి తీయాలి**

**బాధితురాలుకు మెరుగైన వైద్యం అందించాలి**

**కుటుంబంను ప్రభుత్వం ఆదుకోవాలి.**

హైదరాబాద్: జులై7న మలక్ పేట అంద బాలికల వసతి గృహంలో 3వ తరగతి చదివే 8ఏళ్ల అంద బాలికపై హాస్టళ్లలో బాత్రూమ్స్ క్లిన్ చేసే నరేష్ అనే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడితే…ఆ విషయం ను దాచిన హాస్టల్ వార్డెన్ స్వప్న బాధితురాలు తల్లిదండ్రులను పిలిచి అప్పగించి అసలు విషయం కప్పి ఉంచి పాప మెర్చుర్ అయ్యి బ్లీడింగ్ అవుతుందని తప్పు తోవ పట్టించడం,పోలీసులు కూడా 15 రోజులు విషయం బయటకు రాకుండా చేయడం పై వికలాంగుల హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. మలక్ పేట అంద బాలికల వసతి గృహం ముందు వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అందె రాంబాబు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అందుల హాస్టల్ లో 8 ఏళ్ల బాలికపై అఘాయిత్యం జరిగితే గోప్యంగా ఉంచి,బాలికను హాస్పిటల్ కు తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్, పర్యవేక్షణ చేయని శాఖ డైరెక్టర్ శైలజ,అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. శాఖ మంత్రి సీతక్క వార్డెన్ స్వప్న ను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తూనే, విచారణ కమిటీ లో డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ ను వేయడాన్ని ఖండించారు. బాధితురాలుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిందితుడు నరేష్ ను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి ఇన్ని రోజులలో చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించిన పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని అంద బాలికల వసతి గృహాలలో ఆడవారికి మాత్రమే స్టాఫ్ గా తీసుకోవాలని, వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఆందోళన వద్దకు చేరుకున్న సైదాబాద్ ఎమ్మార్వో జయ శ్రీ చేరుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఆందోళన విరమించాలని కోరారు.

# పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మరియు ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు**

**ఏపీ జితేందర్ రెడ్డి**

హైదరాబాద్: పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మరియు ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా ప్రభుత్వం డలు, కళా సంస్కృతులకు మొత్తంగా రూ. 325,05. 03 కోట్ల బడ్జెట్ పై ఏపీ జితేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో తెలంగాణ రైతాంగం ఎంతో నష్టపోయిందని.. రైతు సాధికారత దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేవలం వ్యవసాయానికి 72 వేల కోట్ల రూపాయలు కేటాయించడం ప్రభుత్వ దూరదృష్టిని తెలియజేస్తుందని జితేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని. చేతల ప్రభుత్వమని తక్కువ కాలంలోనే నిరూపించామని తెలిపారు. వివిధ రంగాలకు కేటాయింపులను ఆయన సభలో వివరించారు. మొత్తంగా తెలంగాణ పూర్తి స్థాయి బడ్జెట్ రూ. 2,91,191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు తెలిపారు..

# ఉద్యమంలా వనమహోత్సవాన్ని చేపట్టాలి

**వారం రోజుల్లో టార్గెట్ రీచ్ కావాలి..**

**అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి..**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్ : వన మహోత్సవ కార్యక్రమం పై అన్ని శాఖల అధికారులతో సమీక్ష తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జెడ్పీ క్వార్టర్ల సముదాయంలోని సమావేశ మందిరంలో వన మహోత్సవ కార్యక్రమంపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన లక్ష్యము. నాటిన మొక్కల సంఖ్య. ఎప్పటి వరకు పూర్తి చేస్తారు తదితరు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్డిఓ, అటవీ, ఎక్సైజ్, ఆర్ అండ్ బి, పలు శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వన మహోత్సవంలో విధించిన లక్ష్యాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నుంచి ప్రతి రోజు ఉన్నతాధికారులు దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, ఇది గమనించి అధికారులు ముందుకెళ్లాలని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు ప్లాన్ చేసుకొని ముందుకెళ్లాలని, అలసత్వం వహించవద్దని పేర్కొన్నారు. రహదారుల వెంట రైతు వేదికల్లో, అంగన్వాడీ సెంటర్లు, గ్రామాల్లో మొక్కలు విస్తృతంగా నాటాలని సూచించారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

గ్రామాలు, పట్టణాలు అందంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అద్భుతమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ం జెడ్పి క్వార్టర్ల సముదాయంలోని సమావేశ మందిరంలో జరిగిన పారిశుద్ధ కార్మికుల క్షేమం– గౌరవం అనే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆరోగ్య బీమా కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, స్థానిక సంస్థల నిధుల నుంచి ఆరోగ్య బీమా చేస్తామని తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో మన గ్రామాలు, పట్టణాలు, వీధులు పరిశుభ్రత కోసం పారిశుద్ధ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఆరోగ్య భీమా స్థానిక సంస్థల నిధుల నుంచి కల్పించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికులు రక్షణ కవచాలను ధరించి పని చేయాలని, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్ఓ బాలామణి, యూనిసెఫ్ స్టేట్ ప్రతినిధి ఫణిందర్ కుమార్, డిపిఓ రవీందర్, డిఆర్డి ఓ శ్రీధర్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి ఎస్ ఎస్ ఎన్ వేణు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఉద్యాన వనాధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పలువురు అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తల్లి, కొడుకుల బలవన్మరణం

హైదరాబాద్: తెలంగాణలో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ నగరంలో ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడగా.. తల్లి మరణాన్ని తట్టుకోలేక ఆమె కుమారుడు సైతం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని చైతన్యపురి పీఎస్ పరిధిలో తల్లీకుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొత్తపేట ఎస్ఆర్ కాలనీలో తల్లి గంజి పద్మ (40), కుమారుడు వంశీ (18) అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. పద్మ భర్త శివ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కాగా.. బుధవారం రాత్రి పద్మ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు వంశీ సైతం ఉరి వేసుకుని ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పద్మ కుటుంబం ఏపీలోని ఒంగోలు చెందినవారు. కొన్నేళ్లుగా ఎస్ఆర్ కాలనీలో వీరు నివాసం ఉంటున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి**

అటు, సంగారెడ్డి జిల్లాలోనూ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కంది మండలం తునికిళ్ల తండా శివారులో నాందేడ్ – అకోలా జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు పుల్కల్ మండలం గంగోజీపేటకు చెందిన సందీప్, నవీన్, అభిషేక్‌గా గుర్తించారు. వీరంతా కందిలోని అక్షయపాత్రలో డెలివరీ బాయ్స్‌గా పని చేసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు.

**మరిన్ని ప్రమాదాలు**

మరోవైపు, ఆదిలాబాద్ జిల్లాలోనూ ప్రమాదం జరిగింది. ఆదిలాబాద్ – భీంపూర్ మండలం కరంజీ (టి) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తోన్న బస్సు ఆర్లీ (టీ) గ్రామంలోకి రాగానే అదుపు తప్పు ఓ రైతు కొట్టంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కట్టేసి ఉన్న ఎద్దును ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో దాదాపు 20 మంది ప్రయాణికులున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే, హైదరాబాద్ చంపాపేట ప్రధాన రహదారిపై ఓ ఇన్నోవా వాహనం వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా.. ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు, క్షతగాత్రులు చాంద్రాయణగుట్ట రాజ్ నగర్ కాలనీ వాసులుగా పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తిరుమల ఘాట్ రోడ్డులో..**

అటు, తిరుమల రెండో ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు సమీపంలో ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ, క్లీనర్‌కు గాయాలు కాగా.. పోలీసులు వారిని చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో రెండు లారీ చక్రాలు విడిపోయి కొద్ది దూరం వరకూ రోడ్డుపై లారీ దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇతర వాహనాలేవీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# తరగతి గదుల్లో విద్యార్థుల భవితవ్యం రూపుదిద్దుకుంటుంది.

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**రేగొండ మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల, కస్తూరిబా గాంధీ విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

జయశంకర్ భూపాలపల్లి: తరగతి గదుల్లో విద్యార్థుల భవితవ్యం రూపుదిద్దుకుంటుందని,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. రేగొండ మండలంలో పర్యటించిన కలెక్టర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన కిచెన్ షెడ్ నిర్మాణం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టారు. వంట గదిని పరిశీలించి వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెరుగైన మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు చేపట్టిన మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. పదవ తరగతి గదిని పరిశీలించి విద్యార్థినులతో ఇంగ్లీష్ పాఠాలు చదివించారు. బాగా చదువుకొని మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నత స్థితికి తీసుకురాగలదని కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. గురువులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఏవేని సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. విద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు, ఈగలు వ్యాప్తి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్యాధికారుల దృష్టికి తేవాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఫార్మసి, ల్యాబ్, లేబర్ రూమ్, క్యాజువలిటిని పరిశీలించి ఆసుపత్రి లో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంటింటి జ్వర సర్వేనిర్వహించాలని జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధుల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజేందర్, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, డాక్టర్ హిమబిందు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం ఉంది

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు**

తాండూర్: తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని అందుకు నిదర్శనం తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు 8 లక్షల కోట్లకు పైగా వివిధ పథకాలకు నిధులు మంజూరు చేసిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం వివక్ష చూపుతుందని అనడం సరైనది కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 32,414 కోట్లు, వ్యవసాయ రంగ ఆధునీకరణ మరియు అభివృద్ధి కోసం 1,345 కోట్లు, పన్నుల్లో వాటా కింద 1,96,420 కోట్లు,సమగ్ర శిక్ష అభియాన్ కింద 8,114 కోట్లు, మహిళలు గర్భిణీలు చిన్నారుల కోసం అంగన్వాడి సౌకర్యాల పెంపు కోసం 9,172 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయం కోసం 980 కోట్లు, కంపా పథకానికి 4,018 కోట్లు, పెన్షన్ల కోసం 2078 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నిధుల కింద 8769 కోట్లు,15వ ఆర్థిక సంఘం నిధుల కింద 10,882 కోట్లు, ప్రధానమంత్రి ఆవాస యోజన కింద 9597 కోట్లు,స్మార్ట్ సిటీ యోజన కింద 500 కోట్లు,అమృత్ పథకానికి 3856 కోట్లు, రామగుండం ఎన్టిపిసి కోసం 10,997 కోట్లు, విద్యుత్ రంగ బలోపేతం కోసం 786 కోట్లు, సాగునీటి ప్రాజెక్ట్ ల నిర్మాణం కోసం 2438 కోట్లు, జాతీయ రహదారుల ఏర్పాటు విస్తరణ కోసం 1,58,000 కోట్లు, రైల్వే అభివృద్ధి కార్యక్రమాల కోసం 34,992 కోట్లు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 3672 కోట్లు, జల్ జీవన్ మిషన్ కింద 1588 కోట్లు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 10,086 కోట్లు, రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యం సేకరించడం కోసం 1,86,640 కోట్లు, రైతులకు ఎరువుల సబ్సిడీ కోసం 46,000 కోట్లు, రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ కోసం 6338 కోట్లు, వరంగల్ ఆదిలాబాద్ మెడికల్ కాలేజీలకు 240 కోట్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం 902 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6968 కోట్లు, కరోనా వ్యాక్సిన్ ల కోసం 1800 కోట్లు,స్వచ్ఛభారత్ అభియాన్ కోసం 4418 కోట్లు,ప్రధానమంత్రి స్వనిధి యోజన కింద 848 కోట్లు,ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 1425 కోట్లు,రీజనల్ రింగ్ రోడ్డు కోసం 20,000కోట్లు,ప్రధానమంత్రి ముద్ర యోజన కింద 58,471 కోట్లు,విద్యావిభాగంలో వివిధ పథకాల కోసం 12,548 కోట్లు, షెడ్యూల్ కులాలు,తెగల అభివృద్ధి కోసం 3014 కోట్లు,పర్యాటక రంగ అభివృద్ధి కోసం 958 కోట్లు, మైనారిటీ సంక్షేమ పథకాలు అమలు కోసం 1214 కోట్లు ఈ విధంగా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 8,62,488 కోట్లు కేటాయించిందని అన్నారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఏనాడు వివేక్ష చూపించలేదని చూపించదని అన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ఎంపీలు పాటుపడతారని అందుకే బిజెపి ఎంపీలను ప్రజలు గెలిపించారని అన్నారు. బిజెపి ఎంపీలు తెలంగాణ ప్రజల విశ్వాసాలను నమ్మకాలను వమ్ము చేయరని తెలంగాణ అభివృద్ధిలో బిజెపి ఎంపీల పాత్ర క్రియాశీలకంగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్,బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేయడమే వీరి నైజం అని అన్నారు.

# ఐయామ్ వాట్ ఐయామ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన సీతక్క

హైదరాబాద్: ప్రముఖ సంఘసేవకురాలు, ప్రజ్వల సేవా సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ సునీతా కృష్ణన్ రాసిన 'ఐయామ్ వాట్ ఐయామ్' పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో గల పార్క్ గ్రీన్ హోటల్‌లో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..హ్యూమన్ ట్రాఫికింగ్‌లో చిక్కుకున్న అమ్మాయిలను కాపాడిన సునీతా కృష్ణన్ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. లైంగిక దాడులకు గురైన వారు కుంగిపోకుండా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడం సునీతా కృష్ణన్ గొప్పతనమని ప్రశంసించారు. ఆమెను తాను స్ఫూర్తిగా తీసుకుంటానన్నారు.

ఎంతో మంది అమ్మాయిలకు కొత్త జీవితాన్ని ఇచ్చి ఆమె పలు అంతర్జాతీయ, జాతీయ సంస్థలకు రోల్‌మోడల్‌గా ఎదిగిన తీరును గుర్తుచేశారు. ఆమె పోరాటాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ కూడా పాల్గొన్నారు.

# కొరకురాని కొయ్యగా ఏలేటి

హైదరాబాద్: బీజేపీ అంటే క్రమశిక్షణకు మారు పేరు. పార్టీ పరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. ముందుగా వివిధ స్థాయిల్లో చర్చించాలి. ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలి. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తేనే ముందుకువెళ్లాలి. రాష్ట్ర స్థాయి అంశాలైతే రాష్ట్ర పార్టీ చీఫ్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. పార్టీలో ఏ స్థాయి లీడర్ అయినా ఈ పద్ధతి పాటించాల్సింది. ఐతే బీజేఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాత్రం ఈ పద్ధతిని పాటించడం లేదట? తనకు తోచినది? తెలిసినది పార్టీ వేదికలపై బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారట. బీజేఎల్పీ లీడర్‌గా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై పార్టీకి సమాచారం ఉండకపోవడంతో కమలనాథులు గందరగోళం ఎదుర్కొంటున్నారట. పార్టీ పరంగా మహేశ్వర్‌రెడ్డిని సమర్థించాలా? తమకు సమాచారం ఇవ్వకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోవాలో తేల్చుకోలేకపోతున్నారట బీజేపీ పెద్దలు. ముఖ్యంగా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుంటున్న మహేశ్వర్‌రరెడ్డి దూకుడు చూపుతున్నారు. అయితే పార్టీకి సమాచారమివ్వకుండా? తను సేకరిస్తున్న సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతుండటం వల్ల మహేశ్వర్‌రెడ్డి తన సొంత అజెండా అమలు చేస్తున్నారా? అనే అనుమానాలను రేకెత్తిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒంటరి పోరాటం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి ఏమైనా రహస్య అజెండా ఉందా? అని బీజేపీ నేతలే ఆరా తీస్తుండటం చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందే బీజేపీలోకి వచ్చిన మహేశ్వర్‌రెడ్డి? నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచారు. బీజేపీలోకి కొత్తగా వచ్చినా.. ఆయన సీనియారిటీ, వాగ్ధాటి, సామాజిక నేపథ్యం వంటివి పరిగణలోకి తీసుకుని బీజేఎల్పీ లీడర్‌గా అవకాశమిచ్చింది పార్టీ. అయితే పార్టీ శాసనసభాపక్ష నేతగా ఆయన పలు సంచలన ఆరోపణలు చేస్తూ? ఎప్పటికప్పుడు వార్తల్లో వ్యక్తిగా మారిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని టార్గెట్ చేస్తూ ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు మహేశ్వర్‌రెడ్డి. ఈ విమర్శలు బాగా వైరల్ అవడంతో పార్టీలో ఆయనకు మంచి గుర్తింపే లభించింది. ఐతే, అప్పట్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో పార్టీ కూడా ఈ విమర్శలను బాగా వాడుకుంది. సాక్ష్యాత్తూ ప్రధాని సైతం ఆర్ ట్యాక్స్ అంటూ విమర్శలకు దిగేలా చేసింది. ఐతే ఆ తర్వాత నుంచి మహేశ్వర్‌రెడ్డి విమర్శల దాడి సొంత పార్టీకి కూడా అర్థం కావడం లేదంటున్నారు. విపక్షంలో ఉన్నారు కదా అని మహేశ్వరరెడ్డి విమర్శలను కాంగ్రెస్ లైట్‌గా తీసుకుంటే? ప్రధాన ప్రతిపక్ష పాత్రను తమ స్థానంలో బీజేపీఎల్పీ నేత కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ కూడా షాక్‌కు గురవుతోందట. ఇదే సమయంలో పార్టీలో కనీస సమాచారం లేకుండా? తన రహస్య అజెండాను అమలు చేస్తున్నారని బీజేపీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయిప్రధానంగా ఫ్లోర్‌లీడర్‌గా ఎమ్మెల్యేలను సమన్వయం చేసే బాధ్యత మహేశ్వర్ రెడ్డిపైనే ఉంటుంది.. దీనికి రాష్ట్ర అధ్యక్షుడి సాయం కుడా తీసుకోవాల్సి ఉంటుంది. ఐతే ఈ పనిని పెద్దగా పట్టించుకోని మహేశ్వర్‌రెడ్డి? తాను టార్గెట్ చేసిన నేతలు, వారి కంపెనీలపై విమర్శలకు దిగుతుండటమే చర్చనీయాంశంగా మారింది. ఇలా ఆయన చేస్తున్న విమర్శలు పార్టీని సైతం ఇరకాటంలో పెడుతున్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలతోపాటు.. పార్టీకి కూడా సమాచారం ఇవ్వకుండా స్వయంగా నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు మహేశ్వర్‌రెడ్డి. దీంతో ఎమ్మెల్యేలు, పార్టీ, మహేశ్వర్‌రెడ్డికి మధ్య సఖ్యత లేదన్న ప్రచారం మొదలైంది. బీజేపీలోకి కొత్తగా రావడంతో మహేశ్వర్‌రెడ్డి స్టైల్ ఎవరికీ అర్థం కావడం లేదని? వాస్తవానికి ఆయన ఎప్పుడూ డిఫరెంట్‌గా నడుస్తుంటారనే చెబుతున్నారు పరిశీలకులు. బీజేపీకన్నా ముందు కాంగ్రెస్‌లో పనిచేసిన మహేశ్వరరెడ్డి? అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో తీవ్రంగా విభేదించే వారు. రేవంత్‌కు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడిపి హీట్ పుట్టించే వారు. అప్పట్లో మహేశ్వర్‌రెడ్డితో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. వీరి గ్రూపులో మొత్తం 9 మంది ఉండగా, అందులో మహేశ్వర్‌రెడ్డి తప్ప మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో ఉండిపోయారు. దీంతో తన చిరకాల ప్రత్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకున్నారని భావించినా?. ఇప్పుడు తనకు ఒకప్పటి సహచరులైన భట్టి, ఉత్తమ్‌లను టార్గెట్ చేస్తూ బీ టాక్స్, యూ టాక్స్ అంటూ విమర్శలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇలా వరుసగా మంత్రులపై ఆరోపణలు గుప్పిస్తున్న మహేశ్వర్‌రెడ్డి తాజాగా మరో మంత్రి పొంగులేటిని టార్గెట్ చేయడం చర్చకు దారితీసింది. ఐతే మహేశ్వర్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలు ఏవీ పార్టీ దృష్టికి వెళ్లడం లేదని చెబుతున్నారు. ఆయన రహస్య అజెండాతోనే కాంగ్రెస్‌పై ఆరోపణలు సంధిస్తున్నారని కమలనాథులు అనుమానిస్తున్నారు. ఆ రహస్య అజెండా ఏంటా? అని ఆరా తీస్తున్నారు. తన నియోజకవర్గానికి నిధులు సాధించుకోడానికే వరుసగా మంత్రులను టార్గెట్ చేస్తున్నారా? లేక బీజేఎల్పీ నేతగా పార్టీలో పట్టు పెంచుకోడానికి.. ప్రజలను ఆకట్టుకోడానికి? వన్ అండ్ ఓన్లీ? అనే సంకేతాలు పంపుతున్నారా? అన్న చర్చ జరుగుతోంది.

# రియల్ బూమ్ ఇవ్వనున్న బడ్జెట్

హైదరాబాద్, హైదరాబాద్ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. చారిత్రక నగరం ఇప్పటికే ఐకాన్ గా గుర్తింపు సంపాదించింది. హైదరాబాద్ చుట్టు పక్కల అభివృద్ధి అనూహ్యమైంది. ఈ క్రమంలోనే దేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేనంతగా రియల్ ఎస్టేట్ రంగం విరాజిల్లుతున్నది. నగరం నుంచి ఎటూ 100 కి.మీ. మేరకు వ్యాపారం జోరుగా సాగుతున్నది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో మరింత జవసత్వాలను నింపేటట్లుగా ఉంది. ప్రధానంగా రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ డెవలప్మెంట్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో ఆశలు రేకెత్తించాయి. దాంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అలాగే హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్ పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్ పోర్టు సిస్టం కోసం రూ.50 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం రూ.1500 కోట్లు ప్రతిపాదించారు. రియల్ ఎస్టేట్ రంగానికి అవసరమైన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని స్పష్టమైంది. స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ, 17 వివిధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే సర్టిఫికేట్ కోర్సులను ప్రవేశపెడుతున్నది. ఈ యూనివర్సిటీ రంగారెడ్డి జిల్లాలోనే ఏర్పాటు చేయనుండడంతో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మరిన్ని ప్రాజెక్టులకు అవకాశం లభించింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం హైదరాబాద్ కి మణిహారం. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ పలు ప్రాంతాలను అనుసందానం చేయడంతో హైదరాబాద్ నగరాభివృద్ధి మరింత వేగవంతమైంది. ఇలాంటి ఫలితాలను రాష్ట్రంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు రీజనల్ రింగ్ రోడ్డు ఉపయోగపడుతుంది. ఉత్తర భాగంలో 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డితూప్రాన్‌గజ్వేల్ చౌటుప్పల్ రోడ్డును, దక్షిణం భాగాన 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్?షాద్ నగర్?సంగారెడ్డి రోడ్డును జాతీయ రహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రీజనల్ రింగ్ రోడ్డు హైదరాబాద్ కి ఉత్తర, దక్షిణ ప్రాంతాలను, తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నెట్ వర్క్ తో అనుసంధానం చేయనున్నారు. ఎక్స్ వే ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దీని నిర్మాణానికి తగినంత భూమిని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ మరింత ఊపందుకున్నది. ఇప్పటికే అనేక వెంచర్లు ఈ ఏరియాలో ఉన్నాయి. ఇప్పుడీ ప్రతిపాదనలతో అమ్మకాలు పుంజుకోనున్నాయని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డుకు మధ్య పరిశ్రమలు, వాణిజ్య సేవలు రవాణా పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో ఉత్తర ప్రాంత అభివృద్ధికి రూ.13,522 కోట్లు, దక్షిణ ప్రాంతాభివృద్ధికి రూ.12,980 కోట్ల ఖర్చవుతుందని అంచనా. ఈ ఏడాదికి మాత్రం రూ.1,525 కోట్లు ప్రతిపాదించారు. ఎన్నాండ్లుగానో ప్రతిపాదిత ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టు పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతున్నది. ఐతే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం ద్వారా విశ్వాసం పెరిగింది. ఇన్నాండ్లుగా ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ఇక రీజనల్ రింగ్ రోడ్డు పట్టాలెక్కుతుందని భరోసా కల్పించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, వికారాబాద్ అనంతగిరి సర్క్యూట్, ఖమ్మం కనకగిరి, ఆదిలాబాద్ కుంటాల జలపాతం, కొత్తగూడెం కిన్నెరసాని, పాకాల, ఏటూరు నాగారం సర్క్యూట్ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇకో టూరిజం అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయ వనరులు సమకూర్చుకునే వ్యూహరచన చేస్తున్నది. ఈ ప్రాజెక్టులు ఏ ఏరియాలో చేపడితే ఆ ప్రాంతంలోనూ రియల్ ఎస్టేట్ ఊపందు కోనున్నది.

# స్టడీ టూర్లు... స్టడీ ఎంతో...?

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభం కార్పొరేటర్లకు పట్టదా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఆర్థికంగా కుదేలు కావటంతో పాటు రొటీన్ మెయింటనెన్స్ గగనంగా మారిన సంగతి తెలిసిందే. పంజాగుట్ట, అమీర్‌పేట బల్దియా మార్కెట్ల ఆధునీకరణ కోసం టెండర్ల ప్రక్రియను చేపట్టి, ఏజెన్సీలు ఖరారైన తర్వాత వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా బ్రేక్ వేశారంటే జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభం తీవ్రతను అంచనా వేయవచ్చు. జీహెచ్ఎంసీకి ఆదాయ వనరులను సమకూర్చటంతో పాటు ఆ ఆదాయంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, పౌర సేవల నిర్వహణను చేపట్టాల్సిన కార్పొరేటర్లు ఖజానాలో చిల్లి గవ్వలేనప్పుడు స్టడీ టూర్లకు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి ప్రయత్నాలు, గొంతెమ్మ కోర్కెలు కార్పొరేషన్ మనుగడను ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలేనన్న విమర్శలు సైతం లేకపోలేవు. పైగా పైసాపైసా కూడబెట్టి రైతులకు రుణమాఫీ చేశామని ఇటీవలే వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి సర్కారు ఇలాంటి దుబారా ఖర్చులను ప్రోత్సహిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో అనధికారికంగా స్టడీ టూర్ల విషయంపై పలువురు కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. వచ్చే సంవత్సరం డిసెంబర్ నెలాఖరుతో తమ పదవీకాలం ముగియనుండటంతో మళ్లీ ఎన్నికలెప్పుడు జరుగుతాయో, జరిగినా గెలిచేదెవరో, అవకాశమున్నప్పుడే దేశంలోని రెండు ఇతర మహానగరాలకు స్టడీ టూర్‌కు వెళ్దామన్న విషయంపై కార్పొరేటర్లు చర్చించుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న కొందరు కార్పొరేటర్లయితే ఏకంగా విదేశాలకు స్టడీ టూర్‌కు వెళ్దామంటూ మేయర్‌ను కోరినట్లు సమాచారం. ఇప్పుడు జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి బాగోలేదని మేయర్ సర్దిచెప్పినా, కొందరు కార్పొరేటర్లు స్టడీ టూర్లకు ఆదేశాలివ్వాలని మేయర్ పై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. సకాలంలో సిబ్బందికి జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితిలో ఉన్నప్పుడు స్టడీ టూర్లను తెరపైకి తేవడం సబబు కాదని అదే స్టాండింగ్ కమిటీకి హాజరైన మరి కొందరు కార్పొరేటర్లు వ్యాఖ్యానించినట్లు సమాచారం. మొత్తానికి స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతున్న కొందరు కార్పొరేటర్లు స్టడీ టూర్లకు వెళ్లాల్సిందే, ఎంజాయ్ చేయాల్సిందేనని భీష్మించుకోవటంతో ఈ విషయంపై తర్వాత చర్చించుకుందామంటూ మేయర్ దాట వేసినట్లు సమాచారం. మొత్తం 150 మంది కార్పొరేటర్లున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు చెందిన మొత్తం 146 మంది కార్పొరేటర్లున్నారు. మిగిలిన నాలుగు డివిజన్లలో ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు మృతిచెందగా, మెహిదీపట్నం, బహదూర్‌పురా డివిజన్ల నుంచి కార్పొరేటర్లుగా వ్యవహరిస్తున్న మాజీద్ హుస్సేన్ నాంపల్లి నియోజకవర్గం నుంచి మహ్మద్ మొబిన్ బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్‌ను ఎమ్మెల్యేలుగా గెలవటంతో ఆ రెండు డివిజన్లకు కార్పొరేటర్లు లేక ఖాళీగానే ఉన్నాయి. మొత్తం 146 మంది కార్పొరేటర్లు దేశంలోని రెండు మహానగరాలకు వారం రోజుల పాటు స్టడీ టూర్‌కు వెళితే ఖర్చు కోట్లలోనే అవుతుందంటూ అధికారులు అంచనాలేస్తున్నారు. ఫ్లైటు ప్రయాణం, స్టార్ హోటళ్లలో విడిది, ట్రాన్స్ పోర్టు, రీక్రియేషన్‌తో పాటు ఇతరాత్ర ఖర్చులు కలిపి మొత్తం ఒక్కో కార్పొరేటర్‌కు కనిష్టంగా రూ.5 లక్షల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా వేస్తున్నట్లు సమాచారం. టూర్‌కు మొత్తం రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు సమాచారం. కనీసం ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్లు, పెన్షన్లు కూడా చెల్లించలేని దుస్థితిలో రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల నిధులు జీహెచ్ఎంసీకి ఒక రకంగా పెద్ద ఖర్చే. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు తీవ్రస్థాయిలో నిరసనలు చేపడుతున్న సమయంలో స్టడీ టూర్లకు వెళ్తే, అందుకు నిరసనగా కాంట్రాక్టర్లు వర్షాకాలం సహాయక చర్యలను నిలిపేస్తే ఇబ్బందుల పాలయ్యే ప్రజలకు కార్పొరేటర్లు ఏం సమాధానం చెబుతారన్న విషయంపై కూడా చర్చ జరుగుతుందిహైదరాబాద్ నగర పాలక సంస్థ గ్రేటర్‌గా రూపాంతరం చెందక ముందు నుంచే కార్పొరేటర్ల స్టడీ టూర్ల పరంపర ఉన్నా, వీటి వల్ల కార్పొరేషన్‌కు ఒరిగేదేమిటీ అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 2002 నుంచి 2007 వరకున్న పాలక మండలి అప్పట్లో వంద సంఖ్యకే పరిమితమైన కార్పొరేటర్లు సింగపూర్, మలేషియా వంటి దేశాలకు స్టడీ టూర్లంటూ వెళ్లి, పక్షం రోజుల పాటు అక్కడ ఎంజాయ్ చేసి వచ్చారు. ఆ తర్వాత వచ్చిన పాలక మండలి కూడా నాగ్‌పూర్, ముంబై, అహ్మదాబాద్ వంటి ఇతర మహానగరాలకు స్టడీ టూర్లకు వెళ్లి వచ్చారు. కానీ వారు అక్కడ ఏఅంశంపై స్టడీ చేశారు, ఎంత సబ్జెక్టు సమకూర్చుకున్నారు అన్న విషయాన్ని కార్పొరేటర్లు గానీ, వారితో వెళ్లివచ్చిన ఆఫీసర్లు గానీ బయటకు చెప్పలేదు. పైగా ఆ వివరాలన్నింటినీ గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నాలు చేసేవారు. అహ్మదాబాద్ నగరానికి వెళ్లిన అప్పటి పాలకమండలి సభ్యులు ఓ ప్రైవేటు సంస్థ శానిటేషన్ పనుల నిర్వహణపై అధ్యయనం నిమిత్తం వెళ్లారు. దేశంలోనే పలు నగరాలు శానిటేషన్ పనులు, ఘన వ్యర్థాల నియంత్రణ(సాలిడ్ వేస్ట్) మేనేజ్‌మెంట్‌లో ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు గుర్తించి, సిటీకి వచ్చారు. అయినా ఆ తర్వాత జీహెచ్ఎంసీ సిటీలోని పలు పనులను అదే సంస్థకు అప్పగించటం విశేషం.

# హైదరాబాద్ ను మించిన రంగారెడ్డి

హైదరాబాద్: ఒక భౌగోళిక ప్రాంతంలో పౌరుల యెక్క ఆదాయాన్ని, జీవనస్థితిగతులను తెలుసుకునేందుకు తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ తలసరి ఆదాయంలో తెలంగాణలోని 33 జిల్లాల్లో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర బడ్జెట్ 2024-25 సందర్భంగా సామాజిక ఆర్థిక నివేదిక వెల్లడించగా.. తాజా గణాంకాల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర తలసరి ఆదాయ సగటు రూ.3,11,649గా వెల్లడించారు. అన్ని రకాల వస్తువులు, వివిధ సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒక జిల్లాలోని పౌరులందరికీ సమానంగా విభజిస్తే ఒక్కొక్క పౌరుడికి వచ్చే ఆదాయ వాటాను ఆ జిల్లా తలసరి ఆదాయంగా పేర్కొంటారు. ఈ లెక్కింపు ప్రకారం.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా రూ.9,46,862 ఆదాయంతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రూ.4,49,033 ఆదాయంతో హైదరాబాద్ జిల్లా రెండో స్థానంలో ఉంది. సంగారెడ్డి రూ.3,22,394తో మూడో స్థానంలో, మేడ్చల్-మల్కాజిగిరి రూ.2,95,514తో నాలుగో స్థానంలో ఉంది. యాదాద్రి భువనగిరి రూ.2,67,605 ఆదాయంతో టాప్ 5లో నిలిచింది. ఇక మొ?త్తం 33 జిల్లాల్లో రూ.1,80,241 ఆదాయంతో వికారాబాద్ జిల్లా ఆఖరి స్థానంలో నిలిచింది. తలసరి ఆదాయం జాబితాలో రూ.1,81,825 ఆదాయంతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కింది నుంచి రెండో స్థానంలో నిలవగా.. రూ.1,83,094 ఆదాయంతో జగిత్యాల జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. ఇక దేశ తలసరి ఆదాయం కన్నా రాష్ట్ర తలసరి ఆదాయమే ఎక్కువగా ఉంది. గత మూడేళ్లుగా చూసుకుంటే 2021-22 ఆర్థిక సంవత్సరంలో దేశ తలసరి ఆదాయం 1,50,906 కాగా.. తెలంగాణ తలసరి ఆదాయం 2,69,169 లక్షలుగా ఉంది.

## యువకుడిపై కత్తులతో దాడి

### బేగంపేటలో దారుణం

మంథని: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్ ను అదే గ్రామానికి చెందిన మబ్బు సురేందర్, మబ్బు సాయికుమార్, రంగం దశరథం, అనే ముగ్గురు వ్యక్తులు నిన్న రాత్రి కత్తులు, బీరుసీసాలతో, దాడులు చేశారని బాధితుడైన దాసరి శ్రీనివాస్ సోదరుడు దాసరి శివ పేర్కొన్నాడు. తీవ్ర గాయాలైన శ్రీనివాస్ ను హుటాహుటిన పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు శ్రీనివాస్ సోదరుడు దాసరి శివ తెలిపాడు. గ్రామంలో నిన్న రాత్రి దాసరి శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్న సమయంలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి దాడులు చేశారని, తన తమ్ముడిని దాడి చేసిన వారికి వెనకాల ఉన్నది రామగిరి మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నేత పూదరి సత్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అంటూ బాధితుడు సోదరుడు దాసరి శివ పలు ఆరోపణలు చేశాడు.

## ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు..

ఖమ్మం: ఓఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తూ గంజాయి మొక్కలు పెంచుతుండడంతో సమాచారం మేరకు పోలీసులు గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లాలో జరిగింది. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో కందిమల్ల వెంకటేశ్వర్లు తన కొడుకు శ్రీహరితో ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. గ్రామంలోని యువకులకు గంజాయి అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనితో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ మాటలకే పరిమితం చేస్తున్నాయి

### ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అసంతృప్తి

హైదరాబాద్: :నిన్న కేంద్రం, తాజాగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లు చూస్తుంటే ఆయా ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని మాటలకే పరిమితం చేస్తున్నాయని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అసంతృప్తి చేసింది. బడ్జెట్లు ఆసాంతం జనాన్ని సంతుష్టులు చేసె ప్రయత్నాలు చేశారే గానీ పర్యావరణ పరంగా జరిగిన నష్టాన్ని, భవిష్యత్ లో జరగకుండా ఉండేందుకు ప్రత్యేక నిధుల ప్రస్తావన లేదని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. గ్రీనరీ పెంచేందుకు, వ్యవసాయాన్ని సేంద్రియ విధానం తీసుకుపోయేందుకు స్పష్టమైన నిధులు ప్రకటించకపోవడం ప్రభుత్వాల పర్యావరణ ఉదాసీనతకు నిలువెత్తుగా నిలుస్తుందని పేర్కొంటూ, తక్షణమే కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలో పర్యావరణ పరిరక్షణకు నిధుల సర్దుబాటు ప్రకటించాలని రంగయ్య డిమాండ్ చేశారు.

## ఒలింపిక్ టార్చ్‌తో పారిస్‌లో చిరంజీవి సందడి..



హైదరాబాద్ : క్రీడా అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పారిస్ ఒలింపిక్స్ క్రీడలు ఆరంభమయ్యాయి. గతానికి భిన్నంగా, చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో సీన్ నది ఒడ్డును తమ దేశ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ ఫ్రాన్స్ ప్రారంభ వేడుకలను అదిరిపోయే రీతిలో రూపకల్పన చేసింది. ఈ ఆరంభ వేడుకల్లో పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఇక టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సైతం తన కుటుంబంతో కలిసి ఈ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు. భార్య సురేఖతో కలిసి ఒలింపిక్ టార్చ్ ప్రతిరూపాన్ని పట్టుకుని ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోని చిరు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. పారిస్ వేదికగా జరుగుతోన్న ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న భారత క్రీడాకారులందరికీ ప్రత్యేకంగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రస్తుతం చిరు ట్వీట్ వైరల్ అవుతోంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మేడ్చల్: మేడ్చల్ జిల్లా షామీర్ పేట్లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అదుపుతప్పిన కారు డివైడర్ అవతల వేగంగా పడిపోయింది. ఈ యాక్సిడెంట్లో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**